
మాచర్లలో ఆర్‌ఏఎఫ్ బలగాలు

# నాలుగో రోజూ.. 144 సెక్షన్

- పల్నాడులో మోహరించిన కేంద్ర బలగాలు
- కొనసాగుతున్న పికెట్లు.. మాదలలో పోలీసుల సోదాలు
- మున్సిపల్ పట్టణాల్లో దుకాణాలు మూయించిన పోలీసులు

నరసరావుపేట, మాచర్ల టౌన్, కారంపూడి, ముప్పాళ్ల, రెంటచింతల, సత్తెనపల్లి, మే 17: విధ్వంసాలు.. అరాచకాల నుంచి పల్నాడు ఇంకా తేరుకోలేదు. నాలుగు రోజులుగా జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంది. అయినా ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయం మధ్యే జనం ఉన్నారు. ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. బుధ, గురువారాల్లో జరిగిన పోలీసు తనిఖీల్లో వైసీపీ నేతల ఇళ్లల్లో పెట్రో బాంబులు ఉన్నట్లు తెలియడంతో ప్రజల్లో భయాందోళనలు మరింత పెరిగాయి. ఇంకెన్ని దగ్గర్ల ఇలాంటి బాంబులు, మారణాయుధాలు ఉన్నాయోనని ఆందోళన చెందు తున్నారు. దీంతో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి 600 మంది పోలీసులను రప్పించారు. 17 కంపెనీల కేంద్ర బలగాలు బందోబస్తులో పాల్గొంటున్నాయి. మాచర్ల, నరసరావుపేట, కారంపూడిలో పోలీసు బలగాలు మోహరించాయి. మాచర్ల, గురజాల, నరసరావుపేట నియోజకవర్గాలపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, కారంపూడి, మాచర్ల పట్టణాల్లో దుకాణాలను పోలీసులు మూయించారు. ఈవీఎం ధ్వంసాలకు సంబంధించి వెబ్ ఫుటేజ్‌ను సేకరించి పాల్గొన్న వారందరిపై కేసులు నమోదు చేశారు. వీడియో క్లిప్పింగ్‌ల ద్వారా అల్లరి మూకలను గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. అరాచకాలకు సంబంధించిన కేసులు నమోదు చేశారు. విధ్వంసాలకు పాల్పడిన 250 మందిని ఇప్పటి వరకు అరెస్టు చేశారు. వీరిలో 20 మందిని రిమాండ్‌కు పంపారు. ఈవీఎంను ధ్వంసం చేసిన నాలుగు కేసుల్లో నిందితులను అరెస్టు చేశారు. ముందస్తు చర్యలో భాగంగా ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్లను కొనసాగిస్తున్నారు. పట్టణాల్లో అప్రకటిత కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. శుక్రవారం మాచర్ల పట్టణానికి అందనంగా రెండు కంపెనీల ఆర్‌ఏఎఫ్ (210 మంది) బలగాలు దిగాయి. పట్టణంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అప్రకటిత కర్ఫ్యూ పరిస్థితులు కారంపూడిలో నెలకొన్నాయి. జన సంచారం లేకుండా వీధుల్లో పోలీసులు అడుగడుగునా కాపలా కాస్తున్నారు. ప్రధాన కూడళ్లలో బారికెడ్లు పెట్టి పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. రెంటచింతల మండలంలోని 11 గ్రామాలకు 7 గ్రామాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ రమణమూర్తి చెప్పారు. ముప్పాళ్ల మండలం మాదలలో వైసీపీ నేత గృహంలో పెట్రోల్ బాంబులు దొరకడంతో సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు, సీఐలు రాజేష్, రాంబాబు వంద మంది పోలీసు బలగాలతో శుక్రవారం అనుమానితుల గృహాలను సోదా చేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మాదలలో పెట్రో బాంబులు కలిగి ఉన్న వైసీపీ నాయకుడు గుంటూరు సైదాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హజరతయ్య తెలిపారు. సత్తెనపల్లిలో ప్రజలు రోడ్ల వెంట గుమికూడ కుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ సహకరించాలని సీఐ శ్రీనివాసరావు కోరారు. ఎస్ఐ సంధ్యారాణి ఆధ్వర్యంలో పోలీసులు ప్రధాన కూడళ్ళల్లో బందోబస్తు నిర్వహించారు. నిరవధిక 144 సెక్షన్ అమలుతో పట్టణ వాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారాలను కోల్పోతున్నామని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మాచర్లలో మూతబడ్డ దుకాణాలు


కారంపూడిలో పోలీసు బందోబస్తు


రెంటాలలో పోలీసు పికెటింగ్


మాదలలో పర్యటిస్తున్న డీఎస్పీ గురునాథబాబు

## అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి..

### పిన్నెల్లి సోదరులు ఎలా పరారయ్యారు?

మాచర్లలో హింసకు పాల్పడిన వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గృహ నిర్బంధంలో ఉన్న వారిద్దరూ గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చిన వారు గన్‌మెన్లను కింద ఉంచి ఇంటి మేడపైకి వెళ్లారు. ఆ తర్వాత అర్ధరాత్రి గోడ దూకి ప్రైవేటు వాహనాల్లో గుర్తు తెలియని ప్రదేశానికి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. పిన్నెల్లి సోదరులు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు శుక్రవారం ఉదయం గుర్తించిన గన్‌మెన్లు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వారి అరాచకాలపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్‌గా దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అరెస్టు చేస్తారనే భయంతోనే ముందస్తుగానే వారు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. అయితే హౌస్ అరెస్టులో ఉన్న వారు ఎలా పరారయ్యారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# వేటుతోనైనా.. మారేనా?


కలెక్టర్ శివశంకర్


కలెక్టర్ శివశంకర్

- అధికారుల పనితీరుపై అనుమానాలే!
- ఇంకొందరిపై నివేదికకు అధికారులు సిద్ధం
- కలెక్టర్ శివశంకర్ రిలీవ్.. ఐజీకి ఎస్పీ బాధ్యతలు

నరసరావుపేట, మే 17: ప్రశాంత ఎన్నికలన్నారు.. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.. ధైర్యంగా వచ్చి ఓటేయ్యాలన్నారు.. అసాంఘిక శక్తులు రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.. కానీ అధికారులు ప్రకటనలు అమలు కాలేదు. వారి హెచ్చరికలను అరాచకశక్తులు పట్టించుకోలేదు. పల్నాడు జిల్లాలో పలు ప్రాంతాల్లో పోలింగ్‌కు ముందుకంటే పోలింగ్ రోజు, ఆ తర్వాత అరాచకం రాజ్యమేలింది. పోలీసు అధికారులు చెప్తూ వచ్చిన భద్రతా చర్యలు ఏమయ్యాయో తెలియదు కానీ వైసీపీ మూకలు ఇనుపరాడ్లు, కర్రలతో స్వైర విహారం చేశారు. పోలీసుల సమక్షంలోనే ఎక్కువగా విధ్వంసాలు జరిగాయి. ప్రతి సంఘటనలోనూ పోలీసు అధికారులు ప్రేక్షకపాత్ర వహించారని ఎన్నికల సంఘం గుర్తించింది. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని కలెక్టర్, ఎస్పీ సహా ఆరు మంది పోలీసు అధికారులపై వేటేసింది. ఆ పోలీసు అధికారులపై సిట్ వేసి విచారణకు ఆదేశించింది. ఈ పరిస్థితుల్లో ఇప్పటికైనా అధికారుల తీరులో మార్పు వచ్చేనా అంటే ఇంకా కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డితో పాటు పలువురిని బదిలీ చేసినా యంత్రాంగం తీరు మారలేదని పోలింగ్ పరిణామాలు తెలియజేశాయి. అయితే కేంద్ర ఎన్నికల సంఘం జోక్యంతో ఈ సారి భారీగా వేటుతో పాటు వారిపై విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఇంకొందరి పోలీసు అధికారులు పోలింగ్ సందర్భంగా వ్యవహ రించిన తీరుపై ఉన్నతాధికారులు నివేదిక రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ వరకు, ఆ తర్వాత ఎక్కడా దాడులు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉంది. కలెక్టర్ శివశంకర్ శుక్రవారం ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త కలెక్టర్‌ను శుక్రవారం రాత్రి వరకు నియమించలేదు. ఎస్పీ బింధుమాదవ్ బాధ్యతలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్టత్రిపాఠి స్వీకరించారు. అనంతరం జిల్లాలోని సీఐలతో ఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి శాంతిభద్రతలకు భంగం కలిగితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

### ఆయనొక్కడికే సకల సౌకర్యాలు

కొత్త జిల్లా.. అనేక సవాళ్లు.. సమస్యలు కానీ అవేవీ చూడని శివశంకర్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత సకల సౌకర్యాలు కల్పించుకునేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్న విమర్శలున్నాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాలో ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించారన్న విమర్శలున్నాయి. తన నివాసం కోసం దాదాపు రూ.3 కోట్లు వెచ్చించి సకల సౌకర్యాలు కల్పించుకున్నారు. అదేవిధంగా క్యాంప్ కార్యాలయం కోసం అర్బన్ సెంటర్ భవనాన్ని తీసుకున్నారు. తమ కార్యాల యాల్లో కూర్చునేందుకు సరైన కుర్చీలు కూడా లేవని పలువురు అధికారులు వాపోయినా పట్టించుకోలేదని సమాచారం. ఇక విద్యాశాఖ కార్యాలయానికి స్థలం, ఇంధన బంకు ఏర్పాటుకు జలవనరుల శాఖ కార్యాలయం కేటాయింపుపై విమర్శలు వచ్చాయి. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు ప్రభుత్వం రూపొందించిన ప్రణాళిక ప్రకారం నిర్మాణాలు జరగాల్సి ఉన్నా అందుకు విరుద్ధంగా కలెక్టర్ వ్యవహరించారన్న విమర్శలున్నాయి. సంక్రాంతి సంబరాలు నిర్వహణ, నిధులపై ఆరోపణలు వచ్చాయి. కలెక్టరేట్‌లో ఓ నిర్మాణం కోసం ఐఎంఏను విరాళం కోరినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆకస్మి కంగా కలెక్టర్ బదిలీతో ఆయన కోటరీ లోని అధికారులు కంగుతిన్నారు.

### ఫిర్యాదులు బుట్టదాఖలు

ఎన్నికలకు సంబంధించి అనేక ఫిర్యాదులు ఎన్నికల కమిషన్‌కు అందాయి. వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ జిల్లా ఎన్నికల అధికారికి కమిషన్ పంపింది. వీటిపై పూర్తి స్థాయిలో విచారణ జరపకుండానే ఫిర్యాదులో పేర్కొన్న పరిస్థితులు జిల్లాలో లేవని అంతా బాగుందని ఎన్నికల కమిషన్‌కు జిల్లా ఎన్నికల అధికారులు సమాధానమిచ్చారు. ఈ ప్రక్రియలో ఓ అధికారి కీలకపాత్ర పోషించారని సమాచారం. అధికార పార్టీకి అనుకూలంగా ఆయన వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిశీలనలో ఏకపక్షంగా వ్యవహరించారని ఈసీ నిర్ధారించుకుంది.

### అనుయాయులకే కీలక బాధ్యతలు

అధికారుల బదిలీల్లో కూడా ఎన్నికల నిబంధనలు పాటించలేదు. అధికార పార్టీకి అనుయాయులుగా పేరొందిన అధికారులను కలెక్టర్ బదిలీ చేయకుండా ఇక్కడే ఉంచారన్న ఆరోపణలు వచ్చాయి. వీరికి ఎన్నికల్లో కీలక బాధ్యతలు అప్పగించారని సమాచారం. డీపీవోపై పలు ఆరోపణలు వచ్చాయి. ఆయనకు కలెక్టర్ కీలక బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల సిబ్బందిని ఎవరిని ఎక్కడికి పంపాలనే బాధ్యతలను ఆయన నిర్వహించారు. నకరికల్లు మండలానికి చెందిన మరో అధికారి కూడా ఈ విషయంలో కీలకంగా వ్యవహరించారని తెలిసింది. వీరిద్దరిపై కూడా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. అయినా సదరు అధికారులకు కలెక్టర్ వత్తాసు పలికారన్న విమర్శలున్నాయి. పోలింగ్ తర్వాత రోజు జిల్లాలో పెద్దఎత్తున విధ్వంసాలు జరుగుతున్నా కలెక్టర్ సరైన రీతిలో స్పందించలేదని ఎన్నికల కమిషన్ గుర్తించినట్లు తెలిసింది. ఎన్నికల ప్రక్రియలో నిబంధనలను అతిక్రమించడం వల్లే ఆయనపై బదిలీ వేటు పడిందన్న ప్రచారం జరుగుతోంది.

## స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతని కట్టుదిట్టం చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రతని కట్టుదిట్టం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఎం వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ తుషార్ డూడీతో కలిసి ఆయన గుంటూరు లోక్‌సభ పరిధిలోని ఈవీఎంలను భద్రపరిచిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్‌రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూం పరిసరాల్లో ఎవ్వరినీ అనుమతించొద్దని స్పష్టం చేశారు. సీసీ కెమెరాలు 24 గంటలు పని చేసేలా చూడాలన్నారు. అలానే పోలీసు అధికారులు నిరంతరం పహారా కాయాలన్నారు.


స్ట్రాంగ్ రూంల వద్ద రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

### మరికొన్ని ఈటీపీబీఎస్‌ల రాక

సైన్యంలో పని చేస్తూ సర్వీసు ఓటర్లుగా ఉన్న జిల్లాకు చెందిన పలువురు సైనికులు తమ ఓట్లను ఎలక్ట్రానికల్లీ ట్రాన్సిమేటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ ద్వారా వేస్తున్నారు. ఈటీపీబీఎస్‌లో ఓటింగ్ చేసి ఆ కవర్లను పోస్టు చేస్తున్నారు. శుక్రవారం కలెక్టరేట్‌కు పలు కవర్లను తపాల శాఖ అధికారులు తీసుకొచ్చారు. వాటిని అభ్యర్థులు, ఏజంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూం సీలు ఓపెన్ చేసి లోపల భద్రపరిచి తిరిగి సీలు వేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డీఆర్వో పెద్ది రోజా తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయలు.. అదిరేట్లు

- ఘాటెక్కిన పచ్చి మిర్చి
- కిలో రూ.100కు చేరిన వైనం
- వారం రోజుల వ్యవధిలోనే ధరల పెరుగుదల



గుంటూరు, మే17: కూరగాయల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రధానంగా పచ్చి మిర్చి ధర కిలో రూ.100కు చేరటం సామాన్య ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. వారం రోజుల వ్యవధిలోనే ధరల పెరుగుదలలో మార్పు కనిపిస్తోంది. వేసవి కావటం, డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల ఉత్పత్తి లేకపోవటమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా కూరగాయల వ్యాపారి మల్లికార్జునరావు పేర్కొన్నారు. మొన్నటి వరకు పచ్చి మిర్చి కిలో రూ.50 నుంచి రూ.60 ఉండగా ప్రస్తుతం రూ.100కు చేరింది. ఇక బెండకాయలు, దొండకాయలు, గోరుచిక్కుళ్ళు కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.60కు చేరుకుంది. దోసకాయలు కిలో రూ.30 లు ఉండగా ప్రస్తుతం రూ.40కు చేరుకుంది. ఇక బీన్స్ మొన్నటి వరకు కిలో రూ.100 నుంచి రూ.120 ఉండగా ప్రస్తుతం రూ.200కు చేరింది. ఇక సొరకాయ, బీట్ రూట్, క్యారెట్ ధరల్లో పెద్దగా మార్పు లేదు. టమోటా ప్రస్తుతం కిలో రూ.30కు లభ్యమవుతోంది. కాగా రైతుబజార్లలో కిలో పచ్చి మిర్చి రూ.65, టమోటా కిలో రూ.25లకు విక్రయాలు జరుగుతున్నాయి. అయితే ఆయా కూరగాయలు నాసిరకంగా ఉంటున్నాయి.

## తరచుగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

- గూడ్స్ రైళ్ల మార్గం కోసమేనే కారిడార్ బ్లాక్‌లు!
- ఆయా రోజుల్లో గూడ్స్‌లు మాత్రం రాకపోకలు

గుంటూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రైల్వే శాఖలో తరచుగా వినిపిస్తున్న పదం రోలింగ్ కారిడార్ బ్లాక్. దీని పేరుతో రోజుల తరబడి ప్రయాణీకులు గమ్యస్థానాలకు వెళ్లే రైళ్లను రైల్వే శాఖ ఎడాపెడాగా రద్దు చేసి పారేస్తున్నది. రోలింగ్ కారిడార్ బ్లాక్ కారణంగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలు రైళ్లు ప్రభావితమౌతున్నాయి. గుంటూరు-విశాఖపట్టణం -గుంటూరు సింహాద్రి, గుంటూరు - సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ, సికింద్రాబాద్ - గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ వయా కాజీపేట, గుంటూరు - రాయగడ - గుంటూరు, గుంటూరు - డోన్ - గుంటూరు, విజయవాడ - హుబ్లీ - విజయవాడ, గుంటూరు - నరసపూర్ - గుంటూరు, గుంటూరు - కాచిగూడ - గుంటూరు తదితర రైళ్లు రోజుల తరబడి రద్దు అవుతున్నాయి. వీటితో పాటు మెమూ స్పెషల్స్ కూడా రద్దు చేయబడుతున్నాయి. దీంతో ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. అయితే ఆ సమయంలో గూడ్స్ రైళ్లను నడుపుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

రైల్వే శాఖ ప్యాసింజర్‌లు ప్రయాణించే రైళ్ల కంటే సరుకు రవాణ చేసే గూడ్స్ రైళ్లకే అధికంగా ప్రాధాన్యం ఇస్తోంది. ప్యాసింజర్ రైళ్ల పాత్‌లో ఉంటే గూడ్స్ రైళ్లకు ప్రిసిడెన్స్ ఇవ్వడం కుదరదు. ఈ నేపథ్యంలో రోలింగ్ కారిడార్ బ్లాక్ అనే దానిని ప్రవేశపెట్టి ప్యాసింజర్ రైళ్లను రద్దుచేసి ఆ పాత్‌లో గూడ్స్ రైళ్లకు పచ్చజెండా ఊపుతున్నారు. దీని వలన ఆయా రైళ్లలో ముందస్తుగా టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్న ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. రైళ్ల రద్దు కారణంగా ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాల్సి వస్తోంది. ఇదే సమయంలో క్లరికల్ ఛార్జీల పేరుతో టిక్కెట్ రద్దు అయినా రూ.60 వరకు ఛార్జీని మినహాయించుకొని మిగతా నగదునే ఐఆర్‌సీటీసీ చెల్లిస్తున్నది. ఇక నెలవారీ సీజన్ పాస్ తీసుకొన్న వారికి అది వృథా అవుతున్నది.

గతంలో ఇలాంటి రోలింగ్ కారిడార్ బ్లాక్‌లు ఉండేవి కావు. రైలు పట్టాలు మార్పు చేయాలన్నా, కొత్తవి ఏర్పాటు చేయాలన్నా నిర్ణీత షెడ్యూల్‌ని ప్రకటించి ఆ వ్యవధిలో పనులు చేసేవారు. మళ్లీ దానిని పొడిగించడం అనేది ఉండేది కాదు. ఇప్పుడు రోలింగ్ కారిడార్ బ్లాక్ వచ్చిందంటే మళ్లీ మళ్లీ పొడిగిస్తూ ప్రయాణీకులు అసహనానికి గురయ్యేలా చేస్తున్నారు. గత కొన్నినెలల నుంచి తరచుగా గుంటూరు రైల్వే డివిజన్‌తో పాటు విజయవాడ డివిజన్‌లోనూ రోలింగ్ కారిడార్ బ్లాక్ అమలు జరుగుతుండటంతో పైన పేర్కొన్న రైళ్లను ఎప్పటికప్పుడు రెండు వారాలపాటు రద్దు చేసి దానిని పొడిగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైళ్లు ఎప్పుడు అందుబాటులో ఉంటాయో, ఎప్పుడు ఉండవో తెలియని పరిస్థితి కొనసాగుతున్నది.



## పిడుగురాళ్ల సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్

● ఆలయ భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో చర్యలు

పిడుగురాళ్ల, మే 17: పిడుగురాళ్ల సబ్‌రిజిస్ట్రార్ రాజ్యలక్ష్మిని రిజిస్ట్రేషన్ శాఖ తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. వివరాల్లోకి వెళితే.. పిడుగురాళ్ల పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూమి నిషేధిత జాబితాలో (22ఎ) వుంది. పాత రికార్డుల్లో కూడా రామలింగేశ్వరస్వామి పేరుతోనే భూమి నమోదై వున్నా కొందరు రెవెన్యూ అధికారుల సాయంతో పాత రికార్డులను సైతం పక్కన పడేసి రికార్డులే మార్చేసి వ్యక్తుల పేరుతో పొందుపరిచారు. సర్వే నెంబరు 629లో రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 1.70 ఎకరాలు భూమిని తప్పుడు మార్గంలో నిషేధిత జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. ఈ విషయంపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఆలయ భూముల రిజిస్ట్రేషన్‌పై న్యాయస్థానం మండిపడింది. కోర్టు ఆదేశాల మేరకు పిడుగురాళ్ల సబ్‌రిజిస్ట్రార్ రాజ్యలక్ష్మిని ఆ శాఖ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. రిజిస్ట్రేషన్ పొందిన ఆ వ్యక్తులు ఆలయ భూముల్లో మైనింగ్ కార్యకలాపాలకు దరఖాస్తు చేసుకోవడం, ఆపై మైనింగ్‌తో సున్నపురాయి తవ్వకాలకు అనుమతించడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ నేతల అండదండలతో కొందరు రిజిస్ట్రేషన్ పొందటం మైనింగ్ చేసేందుకు దరఖాస్తు చేసుకోవడంపై హైకోర్టు కొందరికి నోటీసులు జారీచేసింది.

## స్టాంపుల కొరతపై ఫిర్యాదు

● జిల్లా రిజిస్ట్రార్‌కు నోటీసులు జారీ

గుంటూరు(లీగల్), మే17: కోర్టులో నిత్యం ఉపయోగించాల్సిన కోర్టు ఫీజు స్టాంపులు బ్లాక్ మార్కెట్లో అమ్మటంపై న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి ఈ అంశంపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వద్ద శుక్రవారం ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ ఫిర్యాదులో జిల్లా రిజిస్ట్రార్ (స్టాంప్స్ - రిజిస్ట్రేషన్)ను ప్రతివాదిగా చేర్చారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు ఈ స్టాంపులను బ్లాక్‌లో అమ్ముతున్నారని దీనివల్ల న్యాయవాదులు కక్షిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ పిటిషన్ విచారణకు స్వీకరించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా రిజిస్ట్రార్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 29న తమ ఎదుట హాజరై స్టాంపుల కొరత బ్లాక్ మార్కెటింగ్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

# మాచర్లలో మారీచులు

ఆధిపత్య పోరులో బ్రదర్స్ అరాచకాలు

బరితెగించి దాడులకు దిగిన వైసీపీ మూకలు

నాలుగు రోజులుగా భయాందోళనలో పల్లెలు





వెల్దుర్తి మండలం గొట్టిపాళ్లలో ధగ్ధమైన జనసేన నేత బొలేరో వాహనం, కారంపూడిలో వైసీపీ దాడిలో దగ్ధమవుతున్న టీడీపీ నేత వాహనం, కారంపూడిలో వైసీపీ మూకల దాడిలో ధ్వంసమైన దుకాణాలు

మాచర్ల టౌన్, మే 17: దాడులు.. దౌర్జన్యాలు.. అరాచకాలు.. ఆగడాలతో మాచర్లలో మారీచులు చెలరేగిపోయారు. ఇంతకాలం ఎదురేలేదన్నట్లుగా సాగిన మాచర్ల బ్రదర్స్‌కు ఈ సారి చెక్ పడేలా పరిస్థితులు నెలకుంటున్నాయని తెలిసి మారీచ బ్రదర్స్ విధ్వంసం సృష్టించారు. వారు ఒకవిధంగా భావిస్తే మరోలా పోలింగ్ జరిగింది. ఏకపక్షంగా జరుగుతుందని ఆశించగా అందుకు విరుద్ధంగా సాగింది. బూత్‌ల్లో ఏజెంట్లుగా ఎవరూ ఉండకూడదని హెచ్చరికలు జారీ చేసి, దాడులు చేసినా టీడీపీ వర్గీయులు లెక్కచేయలేదు. పోలింగ్ సక్రమంగా జరగకుండా చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా ఓటర్లు వెనక్కి తగ్గలేదు. ఈ పరిణామాలన్నీ తమ ఆధిపత్యానికి అడ్డంకిగా మారాయని భావించిన బ్రదర్స్ పోలింగ్ తర్వాత రోజు తెలంగాణ నుంచి మూడు వందల మందిని తీసుకువచ్చి వారికి విందు ఇచ్చి, మందు పోసి వారిచే విధ్వంసానికి దిగారు. వారు సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ఏకంగా కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాల్సి వచ్చిందంటే బ్రదర్స్ ఆగడాలు ఏ రీతిలో సాగాయో తెలుసుకోవచ్చు. పోలింగ్ రోజు ఉదయం మొదలు మధ్యాహ్నం 3 గంటల వరకు పిన్నెల్లి హౌస్ అరెస్ట్ అయ్యే వరకు వైసీపీ మూకలు రెచ్చిపోతూనే ఉన్నాయి. టీడీపీ కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు తెగబడ్డారు.

### రెంటచింతల మండలంలో..

రెంటచింతల మండలం రెంటాలలో ఉదయం 6 గంటలకే నలుగురు పోలింగ్ ఏజెంట్లపై వేటకొడవళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో చేర్రెడ్డి మంజుల, రఘురామిరెడ్డి, గోపాలరెడ్డి, నాగమల్లేశ్వర రెడ్డిలు గాయపడ్డారు. పాలువాయిగేటులో వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలింగ్ బూత్‌లో దూరి టీడీపీ ఏజెంట్‌పై దాడి చేసి ఈవీఎం ధ్వంసం చేశారు. జెట్టిపాలెం, తుమ్మకోట గ్రామాల్లో కూడా ఘర్షణలు జరిగాయి.

### వెల్దుర్తి మండలంలో..

వెల్దుర్తి మండలంలోని కండ్లకుంటలో టీడీపీ ఏజెంట్ల కుటుంబసభ్యులను వైసీపీ నేతలను గాయపరిచారు. 108లో చికిత్సకు వెళ్లకుండా అడ్డుకుని పైశాచికత్వం ప్రదర్శించారు. అనంతరం ఏజెంట్లను బూత్ నుంచి బయటకు లాగేశారు. బూత్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కేపీ గూడెంలో టీడీపీ ఏజెంట్ తలపగలకొట్టి బయటకు పంపించారు. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లిన కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డిపై వైసీపీ మూకలు దాడి చేసి ఆయన కారును ధ్వంసం చేశారు. గొట్టిపాళ్లలో జనసేన నేత నాగరాజుకు చెందిన వాహనాన్ని దహనం చేశారు. టీడీపీ నేత రెడ్యానాయక్ కారు డ్రైవర్‌ను గాయపరిచి కారు అద్దాలను ధ్వంసం చేశా రు. పట్లవీడు, లోయపల్లి గ్రామాల్లో టీడీపీ నేతలపై రాళ్లు రువ్వారు.



కారంపూడిలో రాడ్లుతో దాడులకు తెగబడుతున్న వైసీపీ గూండాలు



మాచర్లలో ఎమ్మెల్యే సోదరుడు వెంకట్రామిరెడ్డి కారుతో ఢీకొనడంతో గాయపడిన టీడీపీ కార్యకర్తలు

### మాచర్ల పట్టణంలో..

మాచర్లలోని పీడబ్ల్యూడీకాలనీలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి రౌడీ మూకలతో అరాచకం సృష్టించాడు. టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి గృహంపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా తన కారుతో అక్కడున్న టీడీపీ కార్యకర్తలను తొక్కించి తీవ్రంగా గాయపరిచారు. కిందపడిన వారిపై దాడి చేసి మెడలో గొలుసులు, పర్సులను లాక్కొని వెళ్లారు.

### మాచర్ల మండలంలో...

మాచర్ల మండలం కొత్తూరులో మాజీ ఎంపీపీ మద్దిగపు పెదవెంకట్రామిరెడ్డి కారును ధ్వంసం చేసి ఆయన్ను గాయపరిచారు. పశువేములలో బోయ గోపిరెడ్డి కారును ధ్వంసం చేశారు. రాయవరంలో టీడీపీ కార్యకర్తలపై రాళ్లు రువ్వారు. కంభంపాడులో టీడీపీ కార్యకర్తలు పోలింగ్ కేంద్రానికి రాకుండా రాళ్లు రువ్వారు.

### కారంపూడి మండలంలో..

కారంపూడి మండలం పెదకొదమగుండ్లలో కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఒప్పిచర్లలో వైసీపీ మూకలు కర్రలతో రోడ్లపై పరిగెడుతూ టీడీపీ నేతలపై రాళ్లు విసిరారు. కారంపూడిలోని 276 పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. పేటసన్నిగండ్లలోని సింగరుట్ల తండాలో వెబ్ కాస్టింగ్ కెమెరాల వైర్లను కట్ చేశారు. ఒప్పిచర్లలోని 251 పోలింగ్ బూత్‌లో టీడీపీకి ఎక్కువగా ఓట్లు పోలవుతున్నాయని వైసీపీ నేత పాలకీర్తి నరేంద్ర ఈవీఎం బాక్సును పగలకొట్టాడు.

### పోలింగ్ మరుసటి రోజు...

పోలింగ్ మరుసటి రోజు వైసీపీ అభ్యర్థి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి 30 వాహనాల్లో 300 మంది రౌడీ మూకలను పోగేసుకుని కర్రలు, రాడ్లు, కత్తులు, మారణాయుధాలతో కారంపూడిలో వీరంగం సృష్టించారు. టీడీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేసి ఓ కారును తగలబెట్టారు. సీఐ నారాయణస్వామిపై దాడి చేసి గాయపరిచారు. ఇలా నియోజకవర్గంలో వైసీపీ మూకలు విధ్వంసాలకు పాల్పడి నియోజకవర్గంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు.

## పరామర్శకు అనుమతి నిరాకరణ



దూండీ రాకేష్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

అమరావతి, మే 17: మండలంలోని ఉంగుటూరు బాధితులను పరామర్శించేందుకు శుక్రవారం ఉదయం టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు దూండీ రాకేష్ వస్తున్నారని తెలుసుకున్న పోలీసులు ముందస్తుగా విజయవాడ వెళ్లి ఆయనను హౌస్ అరెస్టు చేశారు.ఉంగుటూరు గ్రామంలో పది ఆర్యవైశ్య కుటుంబాలు తన తాతల నాటినుంచి కిరాణా దుకాణాలు పెట్టుకుని జీవిస్తున్నారు. ఎన్నికల ముందు రోజు వైసీపీ నాయకులు వారి ఇళ్లకు వెళ్లి ఓటింగ్‌లో పాల్గొనవద్దు అంటూ చెప్పగా, టీడీపీ వారు మాత్రం మీ ఓటు మీకు ఇష్టం వచ్చిన వారికి వేసుకోండి అని చెప్పారు. పోలింగ్ రోజు సాయంత్రం కొందరు వెళ్లి ఓటు వేసి వచ్చారు. అది గమనించిన వైసీపీ నాయకులు తమ మాట వినకుండా ఓటు వేస్తారా అని సాయంత్రం మీ సంగతి చూస్తామని హెచ్చరించారు. ఇళ్ల వద్దకు వెళ్లి తలుపులు పగలగొడుతూ అసభ్య పదజాలం వాడారు. ఇంతలో సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి రావడంతో వారు వెళ్లిపోయారు. మరుసటి రోజు ఉమ్మడి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ వారి ఇళ్ల వద్దకు వెళ్లి జరిగిన ఘటన తెలుసుకుని వారికి భరోసా కల్పించారు. వారి ఇండ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించి పోలీస్ పికెటింగ్ పెట్టేవిధంగా చర్యలు తీసుకున్నారు. బాధితులు భయంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేయలేదు. వీరిని పరామర్శించి దాడులకు పాల్పడిన వైసీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరేందుకు వస్తున్న దూండీ రాకేష్‌ను ఉంగుటూరు రాకుండా 144 సెక్షన్ ఆంక్షలతో విజయవాడలో గృహనిర్బంధం చేయడం జరిగింది.



నర్సరీ ప్రారంభిస్తున్న వీణారెడ్డి

### విజ్ఞాన్స్ యూనివర్సిటీలో హైటెక్ నర్సరీ ప్రారంభం

గుంటూరు(విద్య), మే17: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రి, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలోని అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హైటెక్ నర్సరీని అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్ ఫామ్‌ను ఇండియా/యుఎస్ఏఐడీ మిషన్ డైరెక్టర్ వీణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీణారెడ్డి మాట్లాడుతూ వాతావరణ మార్పులను తగ్గించడానికి, వ్యవసాయ అటవీ పెంపకాన్ని పెంచడానికి సహకరించాలని విద్యార్థులను కోరారు. నర్సరీలో ఆటోమేటెడ్ ఇరిగేషన్, ఫెర్టిగేషన్ మరియు క్లైమేట్ కంట్రోల్ సిస్టమ్స్‌తో సహా అధునాతన సాంకేతికతలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టీవీఎఫ్ఐ, సీఐఎఫ్ఓఆర్ ఐసీఆర్ఏఎఫ్ చీఫ్ ఆఫ్ పార్టీ మనోజ్ దబాస్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, అగ్రికల్చరల్ విద్యార్థులు పాల్గొన్నారు.

### గృహ నిర్బంధంలో ఉన్న పిన్నెల్లి ఎలా పారిపోయాడు

● కూటమి వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, మే 17: గృహ నిర్బంధంలో ఉన్న పిన్నెల్లి సోదరులు ఎలా పారిపోయారని వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. ఈసీ ఎన్ని చర్యలు తీసుకున్నా వైసీపీకి పోలీసుల సేవలు ఆగడం లేదని కూటమి ఆరోపించారు. వైసీపీ లెక్కలేనితనానికి పిన్నెల్లి సోదరుల పరారీ ఉదాహరణ అన్నారు. పోలీసులను కొట్టి బాంబులు వేయించిన వారిని వదిలేశారన్నారు. ప్రభుత్వం మారుతుందన్న భయంతో వైసీపీ నాయకులు పరారవుతున్నారని, పల్నాడు జిల్లా సరిహద్దులో మొత్తం చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

### వైసీపీ వెన్నులో వణుకు : మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మే 17: రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు తరువాత రాష్ట్రంలో అధికార వైసీపీ నాయకుల వెన్నులో వణుకు మొదలైందని మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ముఖ్య నేతల పలాయానం నుంచి ఫైళ్ల మాయం వరకు అన్నింటిలో అది స్పష్టంగా కన్పిస్తుందన్నారు. తమకు ఎదురే లేదనట్టుగా పల్నాడులో ఎన్నికల హింసను ప్రేరేపించిన ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరుల పరారీ దీనికి తాజా ఉదాహరణ అన్నారు. ఇప్పటివరకు వైసీపీ ఓటమిపై అనుమానంతో ఉన్న వారందరికీ పిన్నెల్లి సోదరుల మాయం స్పష్టత ఇచ్చినట్లయిందన్నారు. జూన్ 4 ఫలితాల్లో వైసీపీ ఘోర పరాభవం మూట గట్టుకోబోతుందన్నారు. గడిచిన ఐదేళ్లలో తప్పుచేసిన వారు ఎక్కడ ఉన్నా జూన్-4 తర్వాత వదిలే ప్రసక్తేలేదని హెచ్చరించారు. పేదలకు ఇవ్వాల్సిన రూ.14 వేల కోట్లు జమ చేయకుండా జగన్ విదేశాలకు వెళ్ళి పోతాడన్నారు. ఆ డబ్బును కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకు దొడ్డిదారుల్లో బిల్లులు చెల్లించేస్తారని తెలిపారు. మీసాలు తిప్పి బాంబులు వేసి పోలీసులపై దాడులు చేసిన రౌడీ ఎమ్మెల్యేలు ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా ఊరుదాటేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే మరికొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా కన్పించకుండా పోవచ్చన్నారు.


## ఉమ్మడి జిల్లాలోనే ప్రశాంతం

### ముగ్గురు చొప్పున కలెక్టర్లు, ఎస్పీలు ఉన్నా ఎన్నికలు హింసాత్మకం

గుంటూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 17 అసెంబ్లీ నియోజకవర్గాలున్నా చాలావరకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేవి. అరకొర సంఘటనలు మినహా బాంబులు విసురుకోవడాలు, మారణాయుధాలతో దాడులు చేసుకోవడం వంటి వి జరిగేవే కావు. ఒక కలెక్టర్, ఒక ఎస్పీ జిల్లా కేంద్రం నుంచే అం తా పర్యవేక్షించే వారు. 2004, 09, 14, 19లో జరిగిన ఎన్నికలను అప్పటి కలెక్టర్లు ప్రశాంతంగా నిర్వహించారు. ఎక్కడా ఎన్నికల సంఘం ఆగ్రహానికి గురైన దాఖలాలు లేవు. జాతీయ స్థాయి నేతలు నరేంద్రమోదీ, సోనియాగాంధీ తదితర నేతల బహిరంగ సభలకు కూడా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి సెక్యూరిటీ పరంగా లోపం జరగకుండా చూశారు. అలాంటిది ప్రస్తుతం మూడు జిల్లాలకు ముగ్గురు కలెక్టర్లు, ఎస్పీలు ఉన్నా ఈ దఫా ఎన్నికలు హింసాత్మకం కావడం ఆందోళన కలిగిస్తోంది. 2004 సార్వత్రిక ఎన్నికల వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 19 అసెంబ్లీ నియోజకవర్గాలుండేవి. అయినా అన్ని ఏర్పాట్లను అప్పట్లో విధులు నిర్వహించిన కలెక్టర్, ఎస్పీలు చూసుకొన్నారు. అప్పట్లో ఇంత సాంకేతిక పరిజ్ఞానం కూడా లేదు. అయినప్పటికీ విజయవంతంగా ఎన్నికల ప్రక్రియని పూర్తి చేశారు. 2009కి వచ్చేసరికి నియోజకవర్గాలు 17కి కుదించారు. అప్పట్లో పల్నాడు జిల్లాలో కోడెల, కాసు కుటుంబాల మధ్య రాజకీయ వైరం ఉండేది. అయినప్పటికీ నేతలను ముందస్తుగా హౌస్ అరెస్టులు చేయడం, నేరచరిత్ర కలిగిన వారిని బైండ్‌వోవర్ చేసి పోలింగ్ రోజున పోలీసుస్టేషన్‌లోనే ఉంచేవారు. తద్వారా పోలింగ్‌కు విఘాతం కలగకుండా చూసేవారు. 2019 వరకు కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. అప్పట్లో కూడా మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, జూలకంటి బ్రహ్మారెడ్డి ఉన్నారు. వీరిని కూడా పోలింగ్ రోజున స్టేషన్, హౌస్ అరెస్టు చేసేవారు. ఇక ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న అభ్యర్థుల వెంట షాడో పార్టీలను పెట్టి ప్రతీ కదలికని వీడియో తీసేవారు. దాంతో వారు కూడా పోలింగ్ బూత్‌లలోకి ప్రవేశించడానికి భయపడేవారు. 2019 నుంచి ఈ ఏడాది మార్చి వరకు వైసీపీ నేతలు ముఖ్యంగా పల్నాడులో వారి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. మాచర్ల, గురజాల, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ప్రతిపక్షాలకు చెందిన పలువురిని పొట్టన పెట్టుకొన్నారు. వైసీపీకి వ్యతిరేకంగా ఏ కార్యక్రమం చేపట్టినా దాడులు చేయడం పరిపాటిగా మారింది. అయినా ఎక్కడా వారిపై పోలీసులు తీవ్ర నేరారోపణల కింద కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. ఆఫీసులు తగలబెట్టినా.. వాహనాలకు నిప్పు పెట్టినా చోద్యం చూశారు. ఎప్పుడైతే ఎమ్మెల్యేల ఆఫీసులు, ఇళ్లకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు వెళ్లడం ప్రారంభించారో అప్పుడే అధికారులకు ఉన్న పవర్ తగ్గిపోయింది. సీఎం జగన్ పర్యటన ఉంటే చాలు ఆ పార్టీ నేతలు ఏకంగా కలెక్టరేట్‌కు వచ్చి మీటింగ్‌లు పెట్టేవారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కువగా టీడీపీ నేతలనే పోలీసులు కేసులు పెట్టి జైలులో పెట్టారు. ఎస్పీగా సీతారామాంజనేయులు ఉన్న సమయంలో టీడీపీ నేతలనే ఎక్కువ సంఖ్యలో డార్మెటరీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒక అపార్టుమెంట్ సెల్లార్ విషయంలో ఏకంగా టీడీపీ మేయర్‌నే అప్పటి పోలీసులు అరెస్టు చేశారు. నియోజకవర్గాలకు సంబంధించి ఏమైనా సమస్యలు చెప్పాలన్నా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ ఆఫీసులకు ఎమ్మెల్యేలు వచ్చేవారు. చివరికి మంత్రి అయినా సరే ప్రభుత్వ అతిథిగృహంలో కలిసే వారే తప్ప వారిళ్లు, ఆఫీసులకు వెళ్లేవారు కాదు. ఈ కారణంగానే శాంతిభద్రతలు అదుపులో ఉండేవి. 17 అసెంబ్లీ నియోజక వర్గాలు కలిగిన జిల్లా అయినా సమర్థంగా ఎన్నికలు నిర్వహించేవారు. ఇప్పుడు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకే జిల్లాలు పరిమితం అయినప్పటికీ హింస పేట్రేగిపోతోన్నది. జిల్లాలను విభజిస్తే పరిపాలన సౌలభ్యం ఎంతో ఉంటుందని చెప్పిన కబుర్లు ఉత్తవేనని తేలిపోయాయి. ప్రధాన మంత్రి పాల్గొన్న సభలోనే సెక్యూరిటీ లోపాలు తలెత్తాయి. ఆ సంఘటన నుంచి కూడా గుణపాఠం నేర్చుకోలేదు. ఎన్నికలకు ముందు జరిగిన దాడులను పరిగణనలోకి తీసుకోకుండా పల్నాడు జిల్లాలోని మాచర్ల, నరసరావుపేట, గురజాలలో తగిన చర్యలు తీసుకోవడం వలనే పోలింగ్ రోజున, ఆ తర్వాత కూడా కక్షలు కార్పణ్యాలు రగులుతూనే ఉన్నాయి.

### అమరావతి ఆంధ్రప్రదేశ్‌కే ఐకానిక్

● 1613వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



వెంకటపాలెం ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే 17: అమరావతి రాజధాని ఆంధ్రప్రదేశ్‌కే ఐకానిక్ అని, అభివృద్ధిని కొనసాగించినట్లయితే యువతకు లక్షల ఉద్యోగాలు అమరావతిలో లభించేవని, కాని సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులని అమరావతిని నిర్వీర్యం చేయటంతో అన్నీ అవకాశాలు జారి పోయాయని, 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1613వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు, మహిళలు మాట్లాడారు. అమరావతిని మూడు ముక్కలు చేయటానికి ప్రధాన కారణం జగన్‌రెడ్డి స్వప్రయోజనాల కోసమని పేర్కొన్నారు. ఈ కుట్ర బయట పడటంతో.. అభివృద్ధి కోసం మూడు రాజధానులు అంశం తెచ్చానని చెపుడుతున్నాడన్నారు. పరిపాలనా వికేంద్రీకరణ కాకుండా అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తే రాష్ట్రం ఎప్పుడో బాగుపడేదన్నారు. వైసీపీ వాళ్ల సొంత ప్రయోజనాల కోసం మూడు అంటూ అభివృద్ధికి ఆటంకం కలిగించారన్నారు. మూడు ప్రాంతాల మధ్య వ్యత్యాసాలు తీసుకొచ్చి రాజకీయంగా లాభ పడాలని మూడు ముక్కలాట పెట్టారన్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 158, 167,178 |
| చికెన్ విత్ స్కిన్ | 306.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 316.00 |

# గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

## జగన్ భక్త అధికారులకు భారీ మూల్యం తప్పదు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, మే 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి కళ్లల్లో ఆనందం చూడటం కోసం ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్న కొంతమంది అధికారులు రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకుంటారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల వేళ, పోలింగ్ ముగిసిన అనంతరం కూడా రాష్ట్రంలో పలు ఘర్షణ లు, అల్లర్లు చోటుచేసుకోవడానికి కొంతమంది అధికారుల ఉదాసీనతే కారణమన్నారు. ఓడిపోతున్నామని గ్రహించే రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగి స్తూ వైసీపీ వరుస దాడులకు పాల్పడిందని, ఈ దాడులకు సహకరిస్తున్న ప్రతి అధికారిపై చర్యలు తీసుకోవాలని మోహనకృష్ణ డిమాండ్ చేశారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే నిబంధనలను అతిక్రమించిన ప్రతి ఒక్కరిపై వేటు తప్పదని హెచ్చరించారు. ఎన్నికల్లో కనీసం తమకు డిపాజిట్లు కూడా దక్కే అవకాశం లేదనే భయంతో వైసీపీ నేతలు కలవరానికి గురవుతున్నారని, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ మూకలు పెట్రేగిపోతూ దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ఓటింగ్ శాతం పెరగడం ప్రభుత్వంపై వ్యతిరేకతకు అద్దం పడుతోందని, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూడా రికార్డు స్థాయిలో నమోదు కావడం ప్రభుత్వం మారడానికి సూచిక అన్నారు. 2019లో మోసపూరిత హామీలతో రాష్ట్రాన్ని ఆయన అన్నివిధాలుగా నాశనం చేశాడని ధ్వజమెత్తారు. రాష్ట్ర భవిష్యత్‌ను తీర్చిదిద్దగల శక్తి సామర్థ్యాలు ఒక్క చంద్రబాబు నాయుడుకే ఉన్నాయని, ఆయనకు ఉన్న సుదీర్ఘ పరిపాలన అనుభవంతో రాష్ట్రాన్ని బాగుచేస్తారని ప్రజలు విశ్వసించారని మన్నవ మోహనకృష్ణ అన్నారు.

## ప్రజలంతా తెలుగుదేశం వైపే : మద్దిరాల

గుంటూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా తెలుగుదేశం వైపే ఉన్నారని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పల్నాడు జిల్లాలో జరుగుతున్న దాడులన్నిటిని ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారని, వైసీపీ నాయకులు ఓడిపోతామనే భయంతోనే టీడీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని అన్నారు. పల్నాడులో వైసీపీ నేతల వాహనాలలో రాడ్లు, కర్రలు ఇతర మారణాయుధాలు పెట్టుకుని తిరిగారని గంగాధర్ తెలిపారు. పల్నాడు జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నేతలకు అనుకూలంగా పని చేశారని ఆరోపించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రోద్బలంతోనే రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నేతలు రాళ్లతో దాడి చేశారని అన్నారు. పోలింగ్ జరగకుండా ఈవీఎం మిషన్లు బద్దలు కొట్టడానికి వైసీపీ వర్గీయులు పూనుకున్నారని అన్నారు. ఓటర్లని భయభ్రాంతులకు గురి చేయాలని కుట్రలకు తెరదించారన్నారు. వైసీపీ నేతలు చేసే అరాచకాలకు ఎదురు నిలబడి ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఓటింగ్‌లో పాల్గొన్నారని అన్నారు. ఏది ఏమైనా కూటమి ప్రభుత్వం రావడం ఖాయమని, జగన్ ఇంటికి వెళ్తాడా, జైలుకు వెళ్తాడా అనేది కాలమే నిర్ణయిస్తుందని తెలిపారు.

## పతకాలు సాధించిన క్రీడాకారులకు అభినందనలు

గుంటూరు(తూర్పు), మే 17 : నేపాల్‌లోని ఖాట్మాండ్‌లో ఈ నెల 4వ తేదీన జరిగిన సౌత్ ఏషియన్ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా చీఫ్ కోచ్ వేంకటేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన డి ప్రగ్న దియా జోస్లిన్ రెండు బంగారు, పి.మీనాక్షి, ఏ.మేరిలు బంగారు, వెండి పతకాలు సాధించినట్టు తెలిపారు. పతాకాలు సాధించిన క్రీడాకారులు ఈ ఏడాది నవంబరులో థాయ్‌లాండ్‌లో జరిగే ఏషియన్ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాలరావు, రాజు తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

## కలేకూరి ప్రసాద్‌కు ఘన నివాళి

గుంటూరు(తూర్పు), మే 17: స్థానిక అంబేద్కర్ కూడలిలో శుక్రవారం విప్లవకవి కలేకూరి ప్రసాదు వర్థంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలేకూరి ప్రసాదు చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నల్లపు నీలాంబరం, బండ్లమూడి స్టాలిన్, కొరివి రజనికాంత్, కారంశెట్టి గోపి, చెరబండి రాజు, శేషు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో కలేకూరి ప్రసాదు వర్థంతి సభ నిర్వహించారు. సభలో భారత్ చేతివృత్తుల రాష్ట్ర కో ఆర్డినేటర్ దొడ్డ రాజేంద్రప్రసాదు, భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్, దళిత సంఘాల నాయకులు చిన్నం డేవిడ్ విలియమ్స్, రావినూతల కమల, బత్తుల అనిల్‌బాబు తదితరులు పాల్గొని కలేకూరి ప్రసాదు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఓట్ల లెక్కింపుపై అభ్యర్థులకు సమాచారమివ్వాలి

● కమిషనర్, ఆర్వో కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), మే 17 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీ, సమయంపై పోటీ చేసిన అభ్యర్థులకు నోటీసు ద్వారా సమాచారం అందించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్, ఆర్వో మాట్లాడుతూ, జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, పోటీ చేసిన రాజకీయ పార్టీల, స్వతంత్ర అభ్యర్థులకు లెక్కింపు తేదీ, సమయం గురించి నోటీసు ద్వారా సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాలతో పాటు గుంటూరు తూర్పు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు జరిగే యూనివర్సిటీలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. సెక్టార్, పోలింగ్ కేంద్రాల వారీగా టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలు తీసుకొచ్చేందుకు, అధికారులు, లెక్కింపు సిబ్బంది, అభ్యర్థులు, ఏజంట్లు లెక్కింపు కేంద్రంలోనికి వచ్చేందుకు వేర్వేరుగా మార్గాలు ఉండాలని, అవసరమైతే బారీకేడింగ్ చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సీసీ కెమెరాలు స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని, సదరు విజువల్స్‌ని యూనివర్సిటీ ప్రాంగణంలోని కంట్రోల్ రూమ్‌లో చూడవచ్చని అభ్యర్థులకు తెలియచేయాలన్నారు. కౌంటింగ్‌కు అవసరమైన మెటీరియల్ చెక్ లిస్ట్ సిద్ధం చేయాలని, కౌంటింగ్ విధులకు అధికారులను, సిబ్బందిని కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ తయారు చేయాలని మేనేజర్‌ని ఆదేశించారు. జీఎంసీలోని పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతరం పోలీస్ భద్రత ఉండేలా మేనేజర్ ప్రసాద్, సూపరింటెండెంట్ శివన్నారాయణ సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. టేబుళ్ల వారీగా, రౌండ్ల వారీగా ఫలితాలను జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్‌కు ఎప్పటికప్పుడు అందించేందుకు అవసరమైన కంప్యూటర్ ఆపరేటర్లు, కంప్యూటర్లు, తగిన ఇంటర్ నెట్ సదుపాయాలను, వీడియోగ్రాఫర్‌లను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏఆర్‌ఓలు సునీల్ కుమార్, భీమరాజు, వెంకటలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఎస్‌ఈ శ్యామ్ సుందర్, ఈఈ సుందరామిరెడ్డి, సిఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్‌ఓ మధుసూదన్, మేనేజర్ ఎస్.ఎస్.ప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



యోగాసనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో సెక్రటరీ విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు

## సీతారామయ్య హైస్కూల్లో ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

● పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల

గుంటూరు(కార్పొరేషన్), మే 17 : నగరంలోని బృందావన్ గార్డెన్స్‌లో గల శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో విజయవంతంగా ముగిసిందని పాఠశాల కరస్పాండెంట్, సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథ చెప్పడం, శాస్త్రీయ నృత్యం, ఆరిగామి, వ్యర్థం నుంచి అర్థం, నాటికలు, తార్కిక ఆలోచనలు, (లాజికల్ థింకింగ్), శాస్త్రీయ నృత్యం, పాశ్చాత్య నృత్యం (వెస్టర్న్ డాన్స్), కాలిగ్రఫీ, పెయింటింగ్, యోగా, మంట లేని వంట, మ్యూజిక్ ఇన్స్ట్రుమెంటల్, ఏరోబిక్స్, డైలాగ్స్ అండ్ డిస్కషన్స్, పప్పెట్ షో వంటి వివిధ విభాగాలలో శిక్షణ ఇచ్చామని, విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారన్నారు. వేసవి శిబిరం ముగింపు కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్ ప్రదానోత్సవంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, పాఠశాల అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, పాఠశాల ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతి దేవి, కో ఆర్డినేటర్లు దుర్గా శ్యామ్, శ్రీదేవి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రాగి సుబ్బారావుకు ఘన నివాళి

గుంటూరు, మే 17 : సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సీనియర్ నేత రాగి సుబ్బారావు సంస్మరణ సభ శుక్రవారం సంగడిగుంట బిఎస్ ఫంక్షన్ హాలులో పార్టీ జిల్లా కార్యదర్శి వేల్పూరి నరసింహారావు అధ్యక్షతన జరిగింది. సభకు అధ్యక్షత వహించిన వేల్పూరి నరసింహారావు మాట్లాడుతూ దివంగత రాగి సుబ్బారావు గత ఐదు దశాబ్దాలుగా పీడిత ప్రజల ఉద్యమాలలోనూ, గుంటూరు జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ కీలకమైన పలు బాధ్యతలు నిర్వహించారని అన్నారు. న్యూ డెమోక్రసీ సీనియర్ నేత, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.ప్రసాద్ మాట్లాడుతూ సుబ్బారావు ఐదు దశాబ్దాలుగా విప్లవమే వృత్తిగా తన జీవితాంతం పని చేశాడని వివరించారు. సామ్రాజ్యవాద భూస్వామ్య దోపిడీ పీడనలేని సోషలిస్టు సమాజ నిర్మాణం కొరకు రాగి సుబ్బారావు పనిచేయటమే కాకుండా తన కుటుంబాన్ని కూడా విప్లవోద్యమానికి అనుగుణంగా తీర్చిదిద్దారని ఆయన అన్నారు. సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకుడు ముప్పాళ్ళ భార్గవ మాట్లాడుతూ రాగి సుబ్బారావు సుదీర్ఘకాలం విప్లవోద్యమంలో వివిధ బాధ్యతలు నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ నాయకుడు మన్నవ హరి ప్రసాద్, విరసం నాయకుడు సిఎస్ఆర్ ప్రసాద్, ప్రజా పోరు నాయకుడు పాటిబండ్ల కోటేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి, ప్రముఖ సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు, ప్రొఫెసర్ షేక్ అబ్దుల్ నూర్ భాషా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి, ఎంసీపీఐ నాయకుడు కాలువ శ్రీధర్, ఓపీడీఆర్ అఖిల భారత అధ్యక్షుడు భాస్కరరావు, ప్రముఖ న్యాయవాది సికా సురేష్, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వినయ కుమార్, దళిత నాయకుడు కొండపల్లి విల్సన్, న్యాయవాది ఎం.సుబ్బారావు, బీసీ మహాసభ రాష్ట్ర నాయకుడు ఉగ్గం సాంబశివరావు, వివిధ వామపక్ష విప్లవ పార్టీల నాయకులు, దళిత బహుజన ప్రజాసంఘాల నాయకులు ప్రసంగించారు.

## పిన్నెల్లి సోదరులతో అంటకాగుతున్న పోలీసు వ్యవస్థ

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు కనపర్తి, మ్యానీ



సమావేశంలో మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు, మ్యాని

గుంటూరు, మే 17(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో పిన్నెల్లి సోదరులతో పోలీసు వ్యవస్థ అంటకాగుతోందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు కనపర్తి శ్రీనివాసరావు, మద్దిరాల మ్యానీ ఆరోపించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పల్నాడు జిల్లాలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి చేసిన అరాచకాలను, హత్యాకాండను అడ్డుకోవటంలో జిల్లా పోలీసు అధికారులు ఘోరంగా విఫలమయ్యారని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. హింస జరగబోతోందని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమీషనర్‌తో పాటు డీజీపీకి సాక్ష్యాధారాలతో సహా ముందుగా విన్నవించినా, చర్యలు చేపట్టటంలో వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. పల్నాడు ఎస్పీని సస్పెండ్ చేసినంత మాత్రాన జరిగిన ప్రాణ, ఆస్తి నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వినుకొండలో వైసీపీ రౌడీ మూకలు ఏకంగా ఎస్సైను నిర్బంధించి తీవ్రంగా గాయపరిస్తే పోలీసు అధికారులకు సిగ్గనిపించటంలేదా అని నిలదీశారు. మీకే రక్షణ లేకపోతే, మిమ్మల్ని నమ్ముకున్న మీ కుటుంబాలకు, సామాన్య ప్రజలకు మీరేమి రక్షణ కల్పిస్తారని వారు ప్రశ్నించారు. ఎంతో నిజాయితీగా పని చేయాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఏఎస్సై, తహసీల్దారుల స్థాయికి దిగజారిపోయి అధికారపార్టీ అడుగులకు మడుగులొత్తటం సిగ్గుచేటని మండిపడ్డారు. వారి అసమర్థత, అవినీతి, పక్షపాతం వల్ల ఎందరో తీవ్ర గాయాలకు గురై ప్రాణ, ఆస్తి నష్టం పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రెంటాల గ్రామంలో చేరెడ్డి మంజుల, రాజగోపాలరెడ్డిపై అతి కిరాతకంగా గొడ్డళ్లతో దాడి చేస్తే అతి సాధారణ సెక్షన్లతో కేసు నమోదు చేయటంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం మారిన వెంటనే అల్లర్లకు బాధ్యులైన వారిపై విచారణ జరిపి అసలైన నేరస్తులను గుర్తించి శిక్షిస్తామని హెచ్చరించారు.



వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న నసీర్ తదితరులు

## ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

గుంటూరు, మే 17(ఆంధ్రజ్యోతి): కాకాని రోడ్డులోని సీతారామనగర్ ఒకటో లైనులోని గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధనా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా ముస్తాబు చేసి పూలరథంపై స్వామి వార్లను ఊరేగింపు కోలాటంతో ఘనంగా నిర్వహించారు. గుంటూరు తూర్పు కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నారు. ప్రజలందరిపై స్వామి ఆశీస్సులు ఉండాలని ఆయన కోరుకున్నారు. కార్యక్రమంలో నీలా శివశంకర్, గట్టి శ్రీను, మంజుపల్లి శివకుమార్, ఎ.నాగేశ్వరరావు, వంగర ఏడుకొండలు పాల్గొన్నారు.

## రక్తపోటు నియంత్రణలో ఉండకుంటే అనర్థాలు

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు (మెడికల్), మే 17 : అధిక రక్తపోటును పూర్తి నియంత్రణలో ఉంచకపోతే పక్షవాతం, గుండె జబ్బులకు దారి తీస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి రక్తపోటు పరీక్షలు చేయించుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన ఆహారపు అలవాట్లు, ప్రతి రోజూ 30 నిమిషాల నడక, వ్యాయామం, ధ్యానం, యోగ చేయడం వల్ల బీపీని అదుపులో ఉంచవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్సీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ ఏ.శ్రావణ్‌బాబు, డీపీఎంవో డాక్టర్ సీహెచ్ రత్న మన్మోహన్, డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గిరిధర్ పాల్గొన్నారు. శ్రీనివాసరావు తోట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ టీ.అఖిల్ నిశాంత్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి బీపీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

## నిబంధనలు అతిక్రమించే లాడ్జి యజమానులపై చర్యలు : సీఐ

గుంటూరు, మే 17 : నిబంధనలు ఉల్లంఘించే లాడ్జిలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కొత్తపేట సీఐ అన్వర్‌బాషా హెచ్చరించారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల ప్రకారం ఈస్ట్ ఏఎస్పీ నచికేత్ షెల్కే ఆధ్వర్యంలో సీఐ షేక్ అన్వర్ బాషా కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని లాడ్జిల యజమానులు, మేనేజర్‌లతో కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. సీఐ అన్వర్ బాషా మాట్లాడుతూ రానున్న ఎన్నికల ఫలితాల కౌంటింగ్‌ను దృష్టిలో పెట్టుకొని నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, బల్క్‌గా రూంలు బుక్ చేసుకుని అనుమానాస్పదంగా ఉన్నట్లయితే వారి వివరాలు తెలియజేయాలన్నారు. ఎక్కువ మొత్తంలో నగదు గాని, మద్యం బాటిల్స్‌గాని దొరికితే లాడ్జిలను సీజ్ చేస్తామన్నారు. లాడ్జిలలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నడపరాదన్నారు.

## దేశ సమైక్యత-ఎదురవుతున్న సవాళ్లపై సదస్సు

మంగళగిరి సిటీ, మే 17: కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్థంతిని పురస్కరించుకుని ఈ నెల 20వ తేదీన విజయవాడలోని చుక్కపల్లి పిచ్చియ్య ఆడిటోరియంలో దేశ సమైక్యత-ఎదురవుతున్న సవాళ్లపై సదస్సు జరుగుతుందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ తెలిపారు. మంగళగిరి సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం నేతలు ఎస్ఎస్ చెంగయ్య, జేవీ రాఘవులు, వై.కమలాకర్, ఎం.చలపతిరావు, జే.బ్రాహ్మణి, ఎస్.గణేష్ పాల్గొన్నారు.

## టీడీపీ కూటమికి 150 స్థానాలు ఖాయం

● చంద్రబాబును విమర్శించే స్థాయి సజ్జలకు లేదు ● పాతర్ల రమేష్

తాడేపల్లి, మే 17: జూన్ 4న ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో టీడీపీ కూటమికి 150 స్థానాలు ఖాయమని వైసీపీకి కనీసం డిపాజిట్లు కూడా దక్కే అవకాశం ఉండదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ వ్యాఖ్యానించారు. శుక్రవారం తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ రమేష్ మాట్లాడారు. చంద్రబాబును విమర్శించే స్థాయి సజ్జలకు లేదన్నారు. అరాచక ప్రభుత్వానికి ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. ఓటమి భయంతో వైసీపీ రాయలసీమ, పల్నాడులో అల్లర్లు సృష్టించిందని, టీడీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేశారని, పులివర్తి నానిని హత్య చేసేందుకు ప్రయత్నించారన్నారు. అలాగే పల్నాడులో పిన్నెల్లి సోదరుల అరాచకాలకు 144 సెక్షన్ విధించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. వందలాది మంది రౌడీలు కత్తులు, కర్రలు పట్టుకొని వీరంగం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ ఇంకా వైసీపీకి కొందరు కొమ్ముకాస్తున్నారని రమేష్ ఆరోపించారు. ప్రతి ఒక్క దాడికి ప్రతి ఒక్క ఘటనకు మూల్యం చెల్లించాల్సి వస్తుందని రమేష్ అన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద ప్రజలు నిత్యం కాపలాగా ఉంటూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని, ఏఎన్‌యూలో స్ట్రాంగ్ రూమ్ సమీపంలో సిద్ధం ఫోటోలు పెట్టి పార్టీలు చేసుకోవడంపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు రమేష్ ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని అందుకే సజ్జల సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. విశాఖలో టీడీపీకి ఓట్లు వేశారన్న కారణంగా వైసీపీవారు నలుగురిపై దాడులకు తెగబడడం దారుణమన్నారు. తమ ఓటమి తథ్యమని వైసీపీ శ్రేణులే కొందరు వ్యాఖ్యానిస్తున్నారని రమేష్ అన్నారు.

## సుందరయ్య వర్ధంతి సభలను నిర్వహించాలి

తాడేపల్లి, మే 17: అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలను మే 19న వాడవాడలా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ సమావేశంలో రామారావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నిత్యావసరాల ధరలు, పెట్రోల్, వంటగ్యాస్ ధరలు బాగా పెరిగాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను బీజేపీ కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ రాజధాని రైతులకు పెండింగ్ ఉన్న రెండు సంవత్సరాల వార్షిక కౌలును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజధాని గ్రామాల్లోని టిడ్కో ఇళ్ల లబ్దిదారులకు బ్యాంకర్లు నోటీసులు ఇచ్చి తాళాలు వేస్తామని బెదిరించడం మానుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు ఈమని రామరావు, ఎం భాగ్యరాజు, సుందర రావు, గడ్డం కృష్ణ, ఆంజనేయులు, నందాజీ, తదితరులు పాల్గొన్నారు.

## కాకుమానులో భారీ వర్షం

కాకుమాను, మే 17: ఐదు రోజుల నుంచి వాతావరణంలో మార్పుల కారణంగా ఎండ నుంచి ఉపశమనం లభించింది. ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజానీకం శుక్రవారం కురిసిన వర్షానికి సేదతీరారు. వర్షం కారణంగా కాకుమానులో బాపట్ల పెదనందిపాడు ప్రధాన రహదారిలో స్టేట్ బ్యాంక్ వద్ద వర్షపునీరు నిలిచి పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కడే ఉన్న వ్యాపార సముదాయాలకు నిత్యం వచ్చే వినియోగదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ, ఆర్ అండ్ బీ అధికారులు సమస్య పరిష్కారం దిశగా పని చేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.

## 20 నుంచి చెన్నై ఐఐటీలో స్పిక్ మాకే అంతర్జాతీయ సమావేశం

తాడేపల్లి, మే 17: ఈ నెల 20 నుండి దేశవ్యాప్తంగా విద్యార్థులు చెన్నైలోని ఐఐటీ క్యాంపస్ స్పిక్ మాకే అంతర్జాతీయ సమావేశానికి సిద్ధమవుతున్నారని ఆంధ్రప్రదేశ్ సమన్వయకర్త కుంచనపల్లి అరవింద హైస్కూల్ డైరెక్టర్ బి ఇంద్రాణి ఓ ప్రకటనలో తెలిపారు. మే 26 వరకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రముఖ కళాకారులు, యోగా నిపుణులు, పండితులతో కూడిన సాంస్కృతిక బృందాలు కూడా విచ్చేస్తున్నారని తెలిపారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులు 300మంది వలంటీర్లు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని, ఒక్కో పాఠశాల నుండి ఐదుగురు విద్యార్థులు ఓ టీచర్‌కు అనుమతి ఇస్తారని ఈ విధంగా రిజిష్టరు చేసుకున్నవారు దేశ నలుమూలల నుండి హాజరవుతారని ఇంద్రాణి తెలిపారు.

## తొలకరి ముందు నవ ధాన్యాలు విత్తుకోవడం తప్పనిసరి



113 తాళ్ళూరులో నవధాన్యాలను పొలంలో వేయటానికి సిద్ధం చేయించిన డీపీఎం కే రాజ కుమారి

ఫిరంగిపురం, మే 17: తొలకరి వర్షం కురవడానికి ముందే రైతులు తమ పొలాల్లో నవ ధాన్యాలను విత్తుకోవడం తప్పనిసరని ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం కే రాజకుమారి సూచించారు. శుక్రవారం ఆమె ఫిరంగిపురం మండలంలోని 113 తాళ్లూరులో ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అవలంబించే పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవధాన్యాల వలన చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొనేలా భూమికి అవసరమైన అన్నిరకాల స్థూల, సూక్ష్మ పోషకాలు అందుతాయన్నారు. పప్పు, నూనె జాతి విత్తనాలు, సుగంధ ద్రవ్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి విత్తనాలు వేయడం వలన భూమిలో కార్బన్ శాతం పెరుగుతుందన్నారు. పచ్చిరొట్ట పైరుగా పెసర మాత్రమే కాకుండా నవధాన్యాలు వేస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. అంతేకాకుండా పశువులకు అధిక పోషకాలతో కూడిన పశుగ్రాసంగా కూడా ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రతీ రైతు ప్రధాన పంట వేసే 45 రోజుల ముందుగా ఈ నవధాన్యాలు వేసి భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు. వీటి విత్తనాల కోసం రైతు నేస్తం ఫౌండేషన్ గ్రామ సమైక్య సంఘం ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలను సంప్రదించవచ్చన్నారు.

## కాకుమానులో భారీ వర్షం

కాకుమాను, మే 17: ఐదు రోజుల నుంచి వాతావరణంలో మార్పుల కారణంగా ఎండ నుంచి ఉపశమనం లభించింది. ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజానీకం శుక్రవారం కురిసిన వర్షానికి సేదతీరారు. వర్షం కారణంగా కాకుమానులో బాపట్ల పెదనందిపాడు ప్రధాన రహదారిలో స్టేట్ బ్యాంక్ వద్ద వర్షపునీరు నిలిచి పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కడే ఉన్న వ్యాపార సముదాయాలకు నిత్యం వచ్చే వినియోగదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ, ఆర్ అండ్ బీ అధికారులు సమస్య పరిష్కారం దిశగా పని చేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.

## రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి పరిపాలన

తాడికొండ, మే 17: రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి సీఎం జగన్మోహనరెడ్డి పరిపాలన చేయటం తగదని రైతులు, మహిళలు పేర్కొన్నారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, రాజధాని రైతులకు మద్దతుగా, బిల్డ్ అమరావతి పేరిట తాడికొండ గ్రామంలో రైతులు, మహిళలు శుక్రవారం నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మూడు రాజధానుల ప్రకటనతో రాష్ట్రాన్ని నాశనం చేసిన సీఎం ఇప్పుడు రాజధాని భూములను తాకట్టుపెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులను, భూములను బ్యాంకులకు తనఖాపెట్టి సంక్షేమ పథకాలు ఎలా అమలుచేస్తారని ప్రశ్నించారు. రాజధాని భూములు తాకట్టు పెడుతున్నట్లుగానే రానున్న రోజుల్లో రాజధానిలోని నిర్మాణాలు జరిగిన భవనాలను అమ్ముకుంటారన్నారు. ఇసుక కొరతను సృష్టించి కార్మికుల పొట్టకొట్టారని దీనివలన లక్షలాది మంది కార్మికులు అప్పుల ఊబిలోకి వెళ్లారన్నారు. అన్నక్యాంటిన్లు మూసేసి పేదవారు ఆకలితో అలమటించేలా చేశారని అన్నారు. మూడు రాజధానుల ప్రకటనను వెనుకకు తీసుకునేవరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు.

## తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు

● ఈనెల 21 నుంచి ప్రారంభం

పెదనందిపాడు, మే, 17: మండల పరిధిలోని వరగానిలో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ తెలుగు రాష్ట్రాల 8వ ఆహ్వాన నాటికల పోటీలు ఈ నెల 21,22,23 తేదీల్లో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. 21న అభినవ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం, శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి కౌసల్యాసుప్రజారామ, తెలుగు కళాసమితి విశాఖ వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంత, 22న రసఝరి పొన్నూరి వారి కాపలా, సద్గురు కళానిలయం గుంటూరు వారి కమనీయం, పండు క్రియేషన్స్ కొప్పోలు వారి పక్కింటి మొగుడు, 23న చైతన్య కళాభారతి కరీంనగర్ వారి స్వప్నం రాల్చిన అమృతం, అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి మనస్విని, ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి విముక్తి నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు పలువురు ప్రముఖులు విచ్చేయనున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులను సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ముద్దన రాఘవయ్య, అధ్యక్ష కార్యదర్శులు పోపూరి నాగేశ్వరరావు, చెరుకూరి సాంబశివరావు, సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం

పెదనందిపాడు, మే, 17: స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం వద్ద శుక్రవారం బ్రహ్మంగారి ఆరాధనా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి విశేషపూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. హోమాలు నిర్వహించారు. ఆయా భజన సమాజాల వారిచే భజనా కార్యక్రమాలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

## ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

పెదనందిపాడు, మే, 17: మండలంలోని నాగులపాడులోని స్వయంభూ శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ విగ్రహాలను కమిటీ సభ్యులు ఊరేగింపు చేసి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. 7రోజుల పాటు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు గొల్లపూడి సాంబశివరావు, ఉపాధ్యక్షుడు పాటిబండ్ల సుబ్బారావు, కార్యదర్శి ఆళ్ళ విజయకుమార్, కోశాధికారి దాసరి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి నంగినేని సింగారావు, సభ్యులు కన్నెగంటి చలమయ్య, కారుమంచి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరంలో పోలీస్ పికెట్

పెదనందిపాడు, మే, 17: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు పోలీస్ పికెట్ ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ టి రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని అన్నవరంలో పోలీస్ పికెట్ ఏర్పాటుచేశామని, గ్రామంలో దుకాణాల వద్ద, కూడళ్ళ వద్ద గుమికూడవద్దని, 144 సెక్షన్ అమల్లో ఉందని తెలిపారు. బడ్డీ కొట్లలో పెట్రోలు, మందు సామాగ్రి అమ్మరాదని తెలిపారు. దుకాణాలు రాత్రి 9గంటల లోపే మూసివేయాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.



దుగ్గిరాల వద్ద విద్యుత్ తీగెలపై కూలిన చెట్లు

## గాలి, వర్షంతో కూలిన చెట్లు.. నిలిచిన విద్యుత్ సరఫరా

దుగ్గిరాల, మే 17: మండలంలోని పలు గ్రామాల్లో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షం, వీచిన గాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. గాలులకు పలుచోట్ల చెట్లు, చెట్లకొమ్మలు విరిగి రోడ్లపైన, విద్యుత్ తీగెలపైనా పడి, విద్యుత్‌సరఫరాలో అంతరాయంతో పాటు, వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. విద్యుత్ సరఫరాను ఉదయం 4గంటలపాటు, సాయంత్రం 3గంటల వరకు నిలిపివేశారు. చెట్లకొమ్మల తొలగింపునకై శనివారం ఉదయం 10గంటల నుంచి చింతలపూడిలో విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సత్యనారాయణ చెప్పారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడికొండూరు, మే 17: 33 కేవీ కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు, లైన్ల కింద చెట్లకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నందున మేడికొండూరు మండలంలోని మేడికొండూరు, సిరిపురం, పాలడుగు, కొర్రపాడు, జంగంగుంట్లపాలెం, పొట్లపాడు, మందపాడు, సరిపూడి, వెలవర్తిపాడు, గుండ్లపాలెం, విశదల గ్రామాలకు శనివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డోకిపర్రు ఏఈ నాగరాజకుమార్ మంగళవారం తెలిపారు. ఈ అసౌకర్యానికి విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# దిక్సూచి DIKSUCHI

# నిఫ్టెమ్‌లో పీహెచ్‌డీ

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. సంస్థ నిబంధనల ప్రకారం ఫుల్ టైమ్ అభ్యర్థులకు ఫెలోషిప్ అందిస్తారు.

### రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్

- ఇందులో మూడు దశలు ఉంటాయి. మొదటి దశలో జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంట. కనీసం 40 శాతం మార్కులు సాధించినవారిని మాత్రమే తరవాతి దశలకు అనుమతిస్తారు.
- రెండో దశలో డిపార్ట్‌మెంట్ లెవెల్ రిటెన్ ఎగ్జామ్ ఉంటుంది. ఇది స్పెషలైజేషన్‌కు సంబంధించి ఉంటుంది. ఇందులో ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, అబ్‌స్ట్రాక్ట్ రైటింగ్, కేస్ స్టడీస్ ఉంటాయి. పరీక్ష సమయం గంట.
- మూడో దశలో ఇంటర్వ్యూ ఉంటుంది. అభ్యర్థులు ఎంచుకొన్న పరిశోధనాంశానికి సంబంధించి ప్రజంటేషన్ ఇవ్వాలి. ఇంటర్వ్యూలో కనీసం 50 శాతం స్కోర్ సాధించినవారిని మాత్రమే అడ్మిషన్ ప్రక్రియకు ఎంపిక చేస్తారు.
- డిపార్ట్‌మెంట్ లెవెల్ రిటెన్ ఎగ్జామ్ స్కోర్‌కు 60 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 20 శాతం, అకడమిక్ మెరిట్‌కు 20 శాతం వెయిటేజీ ఇస్తూ విభాగాలవారీగా మెరిట్ జాబితా రూపొందిస్తారు.



**విభాగాలు-సీట్లు:** అగ్రికల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ విభాగంలో 10 సీట్లు, ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ విభాగంలో 10 సీట్లు, ఫుడ్ ఇంజనీరింగ్ విభాగంలో 9 సీట్లు, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో 9 సీట్లు, ఇంటర్ డిసిప్లినరీ సైన్సెస్ విభాగంలో 9 సీట్లు ఉన్నాయి.

**పరిశోధనాంశాలు:** లైఫ్ సైన్సెస్, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, రిడక్షన్ స్ట్రాటజీస్ ఫర్ ప్లాంట్ ఫుడ్- యాంటీ న్యూట్రిషనల్ ఫాక్టర్స్, నాన్ థర్మల్ ప్రాసెసింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అప్లికేషన్స్, పోస్ట్ హార్వెస్ట్ హార్టికల్చర్ అండ్ టెక్నాలజీ, మష్రూమ్ ప్రొడక్షన్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ స్ట్రాటజీ, ఆపరేషన్స్ అండ్ డెసిషన్ సైన్సెస్, ఫైనాన్స్-అకౌంటింగ్-ఎకనామిక్స్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హెచ్‌ఆర్, ఎక్స్‌పెరిమెంటల్ ఫిజిక్స్, నానో మెటీరియల్స్-బయోసెన్సర్స్, మేథమెటికల్ మోడలింగ్(బయాలజీ/ఎకాలజీ/ఇన్ఫెక్షియస్ డిసీజ్), ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటేషనల్ మోడలింగ్, బయోపాలిమర్స్, ఫుడ్ సేఫ్టీ, మెషిన్ లెర్నింగ్ ఫుడ్ సేఫ్టీ అండ్ సప్లయ్ చెయిన్, ఫుడ్ ఇంజనీరింగ్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ తదితరాలు.

**అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్/మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. యూజీసీ/సీఎస్ఐఆర్/ఐసీఎంఆర్/ఐకార్ నుంచి నెట్/జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ అర్హత లేదా జాతీయ స్థాయిలో ఏదేని ఫెలోషిప్ అర్హత ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. వీరిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 15
- **రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 20న
- **పరీక్ష కేంద్రం:** నిఫ్టెమ్ క్యాంపస్, కుండ్లీ, సోనెపట్ జిల్లా
- **రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూలై 1న
- **ఇంటర్వ్యూలు:** జూలై 2, 3
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 8న
- **మొదటి సెమిస్టర్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 12
- **అడ్మిషన్ ప్రక్రియ ముగింపు:** జూలై 15న
- **వెబ్‌సైట్:** www.niftem.ac.in



# ఏపీ ఏకలవ్య గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలు

గుంటూరు జిల్లా-తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్)- పదకొండో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఎటువంటి ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. పదోతరగతి మార్కుల ఆధారంగా ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూప్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈఎంఆర్ఎస్ విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే ఇతరులకు అవకాశం కల్పిస్తారు. బోధన, వసతి ఉచితం. అభ్యర్థుల ఆసక్తి మేరకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ అందిస్తారు. అర్హతలు ఉన్న అభ్యర్థులు ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలి.

**సీట్ల వివరాలు:** ప్రతి ఈఎంఆర్ స్కూల్లో గ్రూప్‌నకు 30 సీట్లు ఉన్నాయి. ఒక్కో గ్రూప్‌లో 570 సీట్లు చొప్పున మొత్తం 1,710 సీట్లు ఉన్నాయి. వీటిలో 80 శాతం సీట్లను ఎస్టీ అభ్యర్థులకు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లను రిజర్వ్‌డ్ వర్గాలు, అనాథలు, వితంతువుల పిల్లలు, దివ్యాంగుల పిల్లలకు కేటాయించారు.

### గ్రూప్‌లు-సబ్జెక్టులు

**ఎంపీసీ సబ్జెక్టులు:** ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్/బయాలజీ/హిందీ/రీజనల్ లాంగ్వేజ్/ఏదేని ఇతర సబ్జెక్ట్

**బైపీసీ సబ్జెక్టులు:** ఇంగ్లీష్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్/హిందీ/రీజనల్ లాంగ్వేజ్/ఏదేని ఇతర సబ్జెక్ట్

**హ్యూమానిటీస్ సబ్జెక్టులు:** ఇంగ్లీష్, హిస్టరీ; ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిందీ నుంచి రెండు సబ్జెక్టులు; రీజనల్ లాంగ్వేజ్/ఏదేని ఇతర సబ్జెక్టు అదనంగా ఆరో సబ్జెక్టు కింద ఈఎంఆర్ఎస్ అందిస్తున్న వాటిలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.

**ఎంపిక:** ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి పదోతరగతిలో సాధించిన టోటల్ మార్కులు; సైన్స్, మేథమెటిక్స్‌లో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.

- బైపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి పదోతరగతిలో సాధించిన టోటల్ మార్కులు, సైన్స్ మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.
- **వెబ్‌సైట్:** www.aptwgurukulam.ap.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/cqx1uEMలో చదవండి.

# SCHOLARSHIP ALERT

## Aspire Leaders Program 2024

*Description:* The global Aspire Leaders Program is a fully funded 14-week online leadership program offered by the Aspire Institute. It has been designed to help students unlock their potential and become well-rounded professionals.
*Eligibility:* This program is open for students within the age group of 18-29 years. The annual household income of the applicants should be less than 8,00,000. Only first-generation learners are eligible to apply for the program. Participants who have enrolled in or completed an undergraduate program in the last three years can apply. Applicants must have an intermediate level of proficiency in English.
*Prizes & Rewards:* Free access to training modules, live sessions by Havard faculty, and much more
*Last Date to Apply:* 03-07-2024
*Application mode:* Online applications
*Short Url:* www.b4s.in/aj/ALPS1

## Mirae Asset Foundation Scholarship Program

*Description:* Mirae Asset Foundation invites applications from students who are currently pursuing undergraduate or postgraduate courses across India.
*Eligibility:* Open to students who are currently pursuing undergraduate or postgraduate courses across India. Applicants must have scored at least 60% in the previous academic year. The annual family income of the applicants must not exceed INR 8,00,000.
*Prizes & Rewards:* Scholarships up to INR 50,000
*Last Date to Apply:* 26-06-2024
*Application mode:* Online applications
*Short Url:* www.b4s.in/aj/MAFS1

## India Fellow Social Leadership Program



*Description:* India Fellow Social Leadership Program 2024-25 is an opportunity offered by the India Fellow for graduate students and young professionals between 20 and 30 years of age. It is an 18-month leadership program designed to help participants develop their skills and make a positive impact on communities.
*Eligibility:* Open for Indian citizens aged between 20 to 30 years. Applicants must be graduates in any discipline or about to complete graduation by the fellowship start date. Students must be ready for an 18-month full-time commitment to the fellowship and prepared to be placed in any part of the country and any thematic area.
*Prizes & Rewards:* A monthly stipend of up to 22,000 and other benefits
*Last Date to Apply:* 31-05-2024
*Application:* Online applications
*Short Url:* www.b4s.in/aj/IFSA2

buddy4study.com

# జాబ్ కార్నర్

## టీఎస్ సెట్ - 2024

తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష(టీఎస్ సెట్)-2024 నోటిఫికేషన్‌ను ఉస్మానియా యూనివర్సిటీ విడుదల చేసింది. రాష్ట్రంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్ నియామకాలకు అర్హత సాధించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు.

**సబ్జెక్టులు:** జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్-1), జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లీష్, ఎర్త్ సైన్స్, లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్

**అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

**పరీక్ష ఫీజు:** ఓసీలకు రూ.2000. బీసీ/ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ, వీహెచ్, హెచ్ఐ, ఓహెచ్, ట్రాన్స్‌జెండర్‌లకు రూ.1000.

**పరీక్ష కేంద్రాలు:** ఆదిలాబాద్, నిజామాబాద్, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, కర్నూలు, కరీంనగర్, ఖమ్మం, తిరుపతి, మహబూబ్‌నగర్, వైజాగ్, నల్లగొండ

**చివరి తేదీ:** జూలై 2

**పరీక్ష తేదీలు:** 2024 ఆగస్టు 28 నుంచి 31 వరకు

**వెబ్‌సైట్:** telanganaset.org/index.html

# నవ్య | చిత్రజ్యోతి

## ఆ ప్రత్యేక వ్యక్తి ఎవరు?



తన సినిమా ప్రచార కార్యక్రమాలపైన సైతం ఆచితూచి స్పందిస్తారు ప్రభాస్. అలాంటిది శుక్రవారం ఆయన సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఒక్కసారిగా నెటిజన్లలో చర్చనీయాంశం అయింది. 'డార్లింగ్స్ ఎట్టకేలకు మన జీవితాల్లోకి ఒక ప్రత్యేక వ్యక్తి రాబోతున్నారు, వేచి చూడండి' అంటూ ఆయన ఇన్‌స్టాలో పెట్టిన పోస్ట్ క్షణాల్లో వైరల్ అవ్వడంతో పాటు పలు రకాల ఊహాగానాలకు తెరలేపింది. మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్‌గా ఉన్న ప్రభాస్ ఓ ఇంటివాడవబోతున్నారు అని, తన కాబోయే జోడీని పరిచయం చేయబోతున్నారనీ కొందరు నెటిజన్లు స్పందిస్తున్నారు. అయితే త్వరలో 'కల్కి 2898 ఏడీ' చిత్రం విడుదల ఉండడంతో ఆ సినిమా అప్డేట్ గురించి ప్రభాస్ ఇలా స్పందించారంటూ మరికొందరు భావిస్తున్నారు. 'కల్కి' చిత్రంలో కమల్‌హాసన్, దీపికా పదుకొనేకు సంబంధించిన ప్రచార చిత్రాలను విడుదల చేయబోతున్నారనీ, దానికోసమే ప్రభాస్ ఈ పోస్ట్ పెట్టాడని సినీ వర్గాలు చెబుతున్నాయి. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

## కన్నప్ప కోసం కాజల్



మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' లో నటించే స్టార్స్ సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. మొన్న బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్, నిన్న ప్రభాస్, తాజాగా ఇప్పుడు కాజల్. ఇలా రోజుకో స్టార్ ఎంట్రీతో, అప్డేట్స్‌తో 'కన్నప్ప' చిత్రం నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో కాజల్ నటిస్తున్నట్లు ప్రకటించారు. ఇంతకు ముందు 'మోసగాళ్లు' చిత్రంలో విష్ణు, కాజల్ నటించిన సంగతి విదితమే. ఇప్పుడు మరోసారి విష్ణు సినిమాలో కాజల్ నటిస్తున్నారు. డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకుడు. న్యూజిలాండ్‌లో 'కన్నప్ప' చిత్రానికి సంబంధించిన రెండు మేజర్ షెడ్యూల్స్ జరిగాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది. ఈ నెల 20న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'కన్నప్ప' టీజర్ విడుదల చేయనున్నారు.

## బుల్లితెర నటుడు చందు ఆత్మహత్య



బుల్లితెర నటుడు చందు ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. డిప్రెషన్‌తోనే ఆయన ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. శుక్రవారం హైదరాబాద్ మణికొండలోని ఆయన ఇంట్లో ఈ దుర్ఘటన జరిగింది. టీవీ నటి పవిత్ర జయరాం రోడ్డు ప్రమాదంలో చనిపోయాక చందు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తనకు బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధి ఉందని, ఇంకొన్నాళ్లే బతుకుతానని చెప్పారు. ఆత్మహత్యకు ముందు 'ఈ రోజు పవిత్ర పుట్టిన రోజు నన్ను రమ్మంటోంది అని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. త్రినయని, కార్తీకదీపం లాంటి సీరియళ్లతో చందు నటుడిగా గుర్తింపు పొందారు. ఆయనకు భార్య శిల్ప, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఇండియన్ నేటివిటీతో పోకెమాన్

పిల్లలను అమితంగా ఆకర్షించిన యానిమేషన్ సిరీస్‌ల్లో 'పోకెమాన్'కు ప్రత్యేక స్థానం ఉంది. ఇప్పుడు 'పోకెమాన్ హారిజన్స్' పేరుతో సరికొత్తగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సిరీస్‌లో ప్రీమియర్ ఎపిసోడ్‌ను హంగామా టీవీలో ఈ నెల 25న స్ట్రీమింగ్ చేయబోతున్నారు. భారతీయ ప్రేక్షకుల అభిరుచిని దృష్టిలో ఉంచుకొని దీన్ని రూపొందించినట్లు మేకర్స్ తెలిపారు. కథలో ఇక్కడి నేటివిటీకి తగ్గట్లు మార్పులు చేయడంతో పాటు పలువురు ఇండియన్ ఆర్టిస్టులు మేకింగ్‌లో భాగమయ్యారు. ప్రముఖ సంగీత దర్శకులు



విశాల్ - శేఖర్ సంగీతం అందించగా గాయకులు అర్మాన్ మాలిక్, హీరోయిన్ షిర్లే సేటియా ఇందులోని పాత్రలకు తమ గొంతును అందించారు. 'చిన్నప్పుడు పోకెమాన్ టాయ్స్ కలెక్ట్ చేశాను. ఇప్పుడు ఈ సిరీస్‌లోని పాత్రలకు డబ్బింగ్ చెప్పడం మర్చిపోలేని అనుభవం' అన్నారు షిర్లే సేటియా.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలుగు చలనచిత్ర దర్శకులు అనిల్ రావిపూడి, హరీశ్‌శంకర్‌లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్స్ డే సందర్భంగా ఈనెల 19న నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రిని సన్మానించారు.

## కొత్త తరహా కంటెంట్‌తో...



శాంతి చంద్ర హీరోగా, మాజీ మిస్ ఇండియా స్మిమితి కథానాయికగా నటిస్తున్న చిత్రం 'డర్టీ ఫెలో'. దీపిక సింగ్, సత్యప్రకాశ్, నాగినీడు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో జి.ఎస్ బాబు నిర్మించారు. ఈ నెల 24న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వశిష్ఠ చేతుల మీదుగా యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వశిష్ఠ మాట్లాడుతూ 'కొత్త తరహా కంటెంట్‌తో ఈ చిత్రం తెరకెక్కుతోందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి. దర్శకుడి శైలి ఈ సినిమాను ప్రత్యేకంగా నిలబెడుతుంది' అని అన్నారు. శాంతి చంద్ర మాట్లాడుతూ 'డర్టీఫెలో ఆడియోకు చక్కటి స్పందన వచ్చింది. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అన్నారు.

## ఎంటర్‌టైన్ చేసే లారీ



శ్రీకాంత్‌రెడ్డి ఆసం హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లారీ చాప్టర్ - 1'. చంద్ర శిఖ కథానాయిక. రాఖీ సింగ్ కీలకపాత్ర పోషించారు. ఆసం వెంకట లక్ష్మీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను యూనిట్ గురువారం విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 'డైరెక్షన్ కోర్స్ చేశాక యూట్యూబ్‌లో వీడియోలు చేశాను. తర్వాత పలు చిత్రాలకు వివిధ విభాగాల్లో సహాయకుడిగా పనిచేసి అనుభవం గడించాను. ఇప్పుడు 'లారి చాప్టర్-1' అనే సినిమాతో హీరోగా వస్తున్నాను. ఇదొక సరికొత్త యాక్షన్ ఎంటర్టైనర్. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ విడుదల చేస్తున్నాం. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: తాడిపత్రి నాగార్జున.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/HhJ3Ouoలో చదవండి.

# తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



మహాలక్ష్మీదేవి మాతగా,
సరస్వతిదేవిగా దర్శనమిచ్చిన వాసవి అమ్మవారు

## వైభవంగా శ్రీవాసవి మాత జన్మదినోత్సవం

తెనాలి, మారీసుపేట మే 17: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలోని శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీవాసవి కన్యాకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవ వేడుకలను రెండవ రోజు వైభవంగా ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామిజీ) నిర్వహించారు. భక్తులకు శ్రీవాసవి అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకంను నిర్వహించి, వివధరకముల పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. సామూహిక కుంకుమార్చనను మహిళ భక్తులతో నిర్వహించారు. సాయంత్రం సామూహిక లలిత సహస్ర పారాయణం, వాసవిమాత సంకీర్తలను ఆలపించారు. అమ్మవారిని దర్శించిన భక్తులకు బాలస్వామిజీ తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మఠం ట్రస్ట్ ఛైర్మన్ నంబూరు వెంకటకృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, ఉప్పల నాగేశ్వరావు, గోపు రామకృష్ణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### బోసురోడ్డులో

స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యాకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం శ్రీవాసవి కన్యాకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవ వేడుకలను రెండోరోజు కూడా భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శ్రీవింధ్యవాసినీ సమేత నగరేశ్వరస్వామి వారికి ప్రాతఃకాలార్చనలు, గవ్యాంత పూజలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను, వివిధ రకముల పుష్పాలతో అమ్మవారికి పూజలను నిర్వహించారు. సాయత్రం సామూహిక లలితాసహస్రనామ పారాయణం, నిత్యాపాసన, చండీహోమంను నిర్వహించి, ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. భక్తులకు అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నూకల వెంకటవేణుగోపాలరావు, బూర్లె నరసింహారావు, ఉప్పల వరదరాజులు, నూకల భాస్కరరావు, కొణిజేటి శంకరావు, భక్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీవో ప్రసాద్

## స్కూల్, కాలేజీ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

● ఆర్టీవో ప్రసాద్

తెనాలి క్రైం, మే 17: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాల, కళాశాలల బస్సులు, వ్యాన్‌ల యాజమాన్యాలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పొందాలని ఆర్టీవో కె.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆర్టీవో కార్యాలయంలో పాఠశాల, కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తెనాలి ఆర్టీవో కార్యాలయం పరిధిలో 350స్కూల్, కాలేజీ బస్సులు ఉన్నాయి. ఇక నుంచి రోజుకు 20నుంచి 30బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి బస్సుకు 32రకాల ఫిట్‌నెస్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ బస్సుల్లో 60సంవత్సరాలు పైబడిన డ్రైవర్లను నియమించరాదని, డ్రైవర్లకు ఐదు సంవత్సరాల డ్రైవింగ్ అనుభవం ఉండి తీరాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం ముందుగానే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పొందాలని ఆర్టీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, ఎంవీఐ మధుసూధనరావు, తదితరులు పాల్గొన్నారు.



కొత్తపరిమళం నాటికలోని ఓ సన్నివేశం

## ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్న నాటికలు

తెనాలి అర్బన్, మే 17: రూరల్ మండలం కొలకలూరులో ప్రదర్శిస్తున్న నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్నాయి. కొలంకపురి, వైకే నాటక కళా పరిషత్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం మూడు నాటికలు ప్రదర్శించారు. నరసరావుపేటమిత్ర క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన నోట్ దిస్ పాయింట్ నాటికను గంధం నాగరాజు రచించగా షేక్ బాషా దర్శకత్వం వహించారు. సమాజంలో అనాథలు పెరగడానికి కారణాలు గుర్తించి వారిని ఆదుకోవాలని లేని పక్షంలో సమాజానికి పెనుముప్పు కావచ్చని సందేశాన్ని నాటిక అందించింది. కుటుంబ బంధాలను గుర్తుచేస్తూ మళ్లీ కలిసి జీవిద్దాం నాటిక సందేశం ఇచ్చింది. ఈ నాటికను కృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించారు. శారదా ప్రసన్న రచించగా చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. శ్రీకాకుళం శర్వాణి గ్రామీణ గిరిజన సంఘం కళాకారులు ప్రదర్శించిన కొత్తపరిమళం నాటికకు కాండ్రేగుల శ్రీనివాసరావు రచించగా పట్నాయక్ దర్శకత్వం వహించారు. సరిహద్దు సమస్యలతో దేశాల మధ్య జరిగే యుద్ధం అనర్థాలే మిగుల్చుతుందని విశ్వమంతా స్నేహం, శాంతి వెల్లివిరిస్తే అందమైన ప్రపంచం కళ్ల ముందు ఉంటుందని కళాకారులు చాటి చెప్పారు. రంగస్థల నటుడు రామకోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో డీఎస్ దీక్షిత్ పురస్కారాన్ని రంగస్థల నటుడు రవీంద్రారెడ్డికి ప్రదానం చేశారు. కళాపరిషత్ ప్రతినిధులు స్వామి, రమణ, విజయ్, హరిబాబు, సూర్యనారాయణ, సుభాని, సుబ్బారావు పర్యవేక్షించారు. కాట్రగడ్డ రామకృష్ణ, శరత్, వెంకయ్య, శంకర్, తిరుమల్లేశ్వరరావు, మల్లికార్జునరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.




సిరిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

## బీపీ ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

● వైద్యాధికారి ప్రియాంక

కొల్లిపర, మే 17 : బీపీ ఉన్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి ప్రియాంక అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సిరిపురంలో ప్రపంచ బీపీ దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులు బీపీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. బీపీపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ బీపీ ఉన్నవారు వైద్యుల సలహాతో ప్రతిరోజు మందులు వాడుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. ముఖ్యంగా వ్యాయామం చేయడం మంచిదన్నారు. పేదప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగించు కోవాలన్నారు. గర్భిణులు వైద్యుల సలహామేరకు మందులు వాడుకోవాలన్నారు. క్యాంపులో అన్నిరకాల రోగాలకు వైద్యం అందించడమే కాకుండా ఉచితంగా మందులు ఇవ్వడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రమ్య, ఆషాజ్యోతి, సుదర్శనం, బొమ్ము కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లేన్ల రహదారిపై నిలిచిపోతున్న వర్షపు నీరు

● దెబ్బతింటున్న రోడ్డు
● నీటి గొట్టాలకు అడ్డుపడుతున్న మట్టి, గడ్డి
● రహదారి నిర్వహణను పట్టించుకోని అధికారులు

తెనాలి అర్బన్, మే 17: నాలుగు లేన్ల రహదారిలో వర్షపు నీరు నిలిచిపోతోంది. పెదరావూరు నుంచి ఆటోనగర్ వరకు వేసిన రహదారిపై కురిసిన వర్షపు నీరు పోయేందుకు గొట్టాలను ఏర్పాటుచేశారు. ఈ గొట్టాలకు మట్టి, గడ్డి అడుపడటంతో నీరు కాల్వలోకి పోవడం లేదు. దీంతో రోజుల తరబడి రోడ్డుపై నీరు నిలబడటంతో రహదారి దెబ్బతింటోంది. ఇప్పటికే వర్షాలకు పలుచోట్ల గుంతలు పడ్డాయి. రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఏర్పాటుచేసి వాటిగుండా వాన నీరు కాల్వలోకి వెళ్లేందుకు గొట్టాలు అమర్చారు. ఈ మధ్య కాలంలో గ్రామీణ ప్రాంతాల నుండి వరి గడ్డి ట్రాక్టర్లపై ఇతర ప్రాంతాలకు భారీగా రవాణా చేశారు. డివైడర్ వెంట ఉన్న చెట్ల కొమ్మలకు పట్టుకున్న గడ్డి రోడ్లపై చేరింది. గత కొంత కాలంగా ఈ రహదారి శుభ్రం చేసే పనిని మున్సిపాలిటీ పట్టించుకోకుండా వదిలి వేసింది. జగ్గడిగుంటపాలెం వంతెన వరకు క్రమంతప్పకుండా రహదారి అంచుల్లో పేరుకుపోయిన మట్టి, ఇసుక, గడ్డిని తొలగించేవారు. పెదరావూరు పంచాయతీ కార్మికులు కూడా తమ పరిధిలో ఉన్న రహదారి వెంట శుభ్రం చేసేవారు, కానీ కొన్ని వారాలుగా పట్టించుకోకపోవడంతో పెద్ద ఎత్తున రోడ్ల వెంబడి మట్టి, గడ్డి పేరుకుపోయింది. గురువారం కురిసిన భారీ వర్షపు నీరంతా రోడ్లపైనే ఉండిపోయింది. తారురోడ్డుపై నీరు నిలబడితే త్వరగా దెబ్బతినే ప్రమాదం ఉంది. రూ.40 కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారి ఈ ప్రాంతానికి మంచి సౌకర్యంగా ఉంది. చిన్నపాటి నిర్వహణ లోపం కారణంగా రహదారి దెబ్బతింటే రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడతాయి. వెంటనే మున్సిపల్, పంచాయతీ అధికారులు తమ పరిధిలో రహదారిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని రోడ్డు పదికాలాల పాటు పదిలంగా ఉండేలా కాపాడాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నాలుగు లేన్ల రహదారిలో నిలిచిపోయిన వర్షపు నీరు



గొట్టాలకు అడ్డుపడిన గడ్డి, మట్టి

## ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధనోత్సవాలు

తెనాలి, మారీసుపేట మే 17: జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 331వ ఆరాధన మహోత్సవములు ఘనంగా నిర్వహించారు. స్థానికి గాంధీచౌక్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆరాధనోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు దేవాలయంలో బారులు తీరి స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. జనసేన పీఏసీ ఛైర్మన్, తెనాలి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ స్వామి, తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, నియోజకవర్గ శాసన సభ్యుడు అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వజ్రాల శివకుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఆయనను దుశ్శాలవాతో, పూలమాలలతో సత్కరించారు. ఆలయ ఆర్చకులు అయనను ఆశీర్వదించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైసీపీ శ్రేణులు, భక్తులు పాల్గొన్నారు.





స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే శివకుమార్,
మాజీ మంత్రి రాజేంద్రప్రసాద్,
జనసేన పీఏసీ ఛైర్మన్ మనోహర్

## యువత విద్యతోపాటు క్రీడలలో రాణించాలి

● గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి

తెనాలి, మారీసుపేట మే 17: యువత విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించాలని టీడీపీ నాయకులు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి అన్నారు. స్థానిక సుల్తానాబాదులోని ఎస్ఎస్ఎస్ యూత్ సభ్యులకు శుక్రవారం టీడీపీ నాయకులు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, అంగలకుదురు గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణంలు విద్యార్థులకు క్రికెట్ కిట్స్‌ను, వాలీబాల్స్‌ను, నెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరవల్లి మురళి మాట్లాడుతూ వేసవి సెలవలలో యువత సెల్‌ఫోన్లకు భానిసలు కాకుండా, తమ సమయాన్ని వృథా చేయకుండా తమకు నచ్చిన క్రీడలలో నైపుణ్యాన్ని మెరుగు పరుచుకొని, క్రీడలలో రాణించాలని కోరారు. తల్లిదండ్రులు కూడా పిల్లల్లోని క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించాలని కోరారు. యువతకు క్రీడల వలన మానసిక ధైర్యాన్ని, శారీరక స్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. యువత కూడా క్రీడలలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరవచ్చునని, తద్వారా తల్లిదండ్రులకు రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగలకుదురు గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, శంకర్‌నాయక్, హనుమంత్‌నాయక్, మహేష్‌నాయక్, కార్తిక్, విద్యార్థులు, గణేష్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



యువతకు క్రికెట్ కిట్‌లను అందిస్తున్న టీడీపీ నాయకులు,
గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, నాగ భూషణం తదితరులు

## కూటమి అభ్యర్థుల గెలుపు రాష్ట్రాభివృద్ధికి మలుపు

● జనసేన మండల అధ్యక్షుడు వీరెళ్ళ వెంకటేశ్వరరావు

పెదకాకాని, మే 17: కూటమి అభ్యర్థుల గెలుపు రాష్ట్ర అభివృద్ధికి మలుపు అని పెదకాకాని మండలం జనసేన అధ్యక్షుడు వీరేళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. పెదకాకాని సెంటర్లో గల జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు వీరెళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ఎన్నికల కన్నా 2024వ సంవత్సరం ఎన్నికలలో అత్యధిక పోలింగ్ జరిగిందని. జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకంతో అన్నివర్గాల ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి గంటలు తరబడి క్యూ లైన్‌లో నిలబడి ఓటు హక్కుని వినియోగించుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు మార్పుని కోరుకున్నారని అన్నారు. జనసేన వ్యవస్థాపకులు పవన్ కళ్యాణ్ మాటకి కట్టుబడి జన సైనికులు, కార్యకర్తలు, కూటమి అభ్యర్థుల గెలుపు కోసం అన్ని నియోజకవర్గాల్లో పని చేశారని తెలిపారు. పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ 25వేల మెజార్టీతో గెలుస్తారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారని, రోడ్లు, డ్రైనేజీ , సరైన మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడ్డారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుపరి పరిపాలన అందించాలని కోరారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ గెలుపుకి సహకరించిన ప్రజలకు, కార్యకర్తలకు, సినీ ప్రముఖులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు జెట్టి మారుతి, బండారు అప్పారావు, పల్లంపాటి రమేష్,బోనా ప్రసాదు, రామిశెట్టి రామారావు, కోలా వాసు, పల్లంపాటి సాంబశివరావు, మండల కార్యదర్శి శ్రీనివాసరావు, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



నమూనాలను తిలకిస్తున్న ముస్లింలు

## మసీదులో నమూనాల ప్రదర్శన

తెనాలి అర్బన్, మే 17: వహాబ్ రోడ్డులో మదీనా మసీదులో శుక్రవారం ముస్లిం పవిత్ర క్షేత్రాల నమూనాలను ప్రదర్శించారు. సౌదీ అరేబియాలోని కాబా, మదీనా, మునర్వాల నమూనాలను బాల బాలికలు రూపొందించి ప్రదర్శించారు. మదరసాకు చెందిన 60 బాల బాలికలు చేసిన నమూనాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. చిన్నారులను మసీదు కమిటీ సభ్యులు అభినందించారు. షేక్ యాకూబ్, చాంద్‌బాషా, ముఫ్తీ ఉస్మాన్, అల్‌కామా తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యం చేరని ఉపాధి హామీ పథకం

● ఈ ఏడాది 2.5 లక్షల పనిదినాలే లక్ష్యం
● 1389 పనుల నిర్వహణకు ప్రతిపాదనలు




పొన్నూరు టౌన్, మే 17: గ్రామాలలో నిరుపేదలకు స్థానికంగా ఉపాధి కల్పించి వలసలు నివారించేందుకు ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం లక్ష్యాన్ని అందుకోవటంలో వెనుకబడింది. గతంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం వినియోగించుకుని ఈ పథకం ద్వారా గ్రామాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించుకునేందుకు గ్రామస్థాయి పాలకుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం వరకు ప్రత్యేక శ్రద్ధ పెట్టేది. ఉపాధి నిధులతో కూలీలకు పని కలిపించటమే కాకుండా గ్రామాల ప్రగతికి నాటి పాలకులు బాటలు వేశారు. అయితే ఐదేళ్లుగా ఈ పథకం సద్వినియోగం చేసుకోవటంలో పాలకుల వైఫల్యం కనపడుతోంది. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డును నమోదుచేయటం నాటినుంచి కూలీలకు 100 రోజులపాటు వేసవిలో పనిదినాలు కల్పించేవారు. ఈ పథకం ద్వారా పంట కాల్వలు, చెరువులు పూడికతీత తీసేవారు. అంతేకాకుండా హార్టీకల్చర్ పంటలకు ఈ పథకాన్ని అనుసంధానం చేసి పండ్ల తోటల సాగును ప్రోత్సహించేవారు. గడిచిన ఐదేళ్లుగా ఉపాధిహామీ పథకం గురించి ఎటువంటి ప్రజోపకర పనులు జరగలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గృహ నిర్మాణ పథకంలో సైతం ఉపాధి నిధులను జోడించి కూలీల పనిదినాలను ఈ పథకం ద్వారా చెల్లించటంతో సామాన్య నిరుపేదల, మధ్య తరగతి ప్రజలకు ఉపాధిహామీ పథకం అర్థికభారాన్ని తగ్గించింది. అలాంటి పథకం నిర్వీర్యం కావటంపై గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 1389 పనులు గుర్తింపు...

పొన్నూరు మండలంలో ఈ ఏడాది జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 1389 పనులు చేపట్టాలని ప్రతిపాదనలు అధికారులు ఆమోదించారు. పొన్నూరు మండలంలో 29గ్రామాలు, రెండు శివారు గ్రామాలు ఉన్నాయి. ఇందులో ఆలూరు, చింతలపూడి, పెద ఇట్టికంపాడు, వడ్డిముక్కల, కట్టెంపూడి గ్రామాలను ప్రభుత్వం పురపాలక సంఘంలో విలీనం చేస్తున్నామనే నెపంతో ఎన్ఆర్ఈజీఎస్ పథకం నుంచి తొలగించింది. ఆ నాటి నుంచి ఆ గ్రామాల్లో పురపాలక సంఘం నిధులు కానీ, ఎన్ఆర్‌జీఎస్ నిధులు కానీ మంజూరు కాకపోవటంతో ఈ ఐదు గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయింది. మిగిలిన 24 గ్రామాల్లో 9607 మంది వలస కూలీలకు అధికారులు జాబ్‌కార్డులు మంజూరు చేశారు. వీరిలో పనుల కోసం కేవలం 7482మంది మాత్రమే పనుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గతంలో 10వేలకు పైగా జాబ్ కార్డులు ఉండగా లక్షల పనిదినాలు కల్పించేవారు. ప్రస్తుతం జాబ్‌కార్డుల సంఖ్య తగ్గిపోవటంతోపాటు, కూలీలు, పనుల నిర్వహణపై ఆసక్తి లేకుండా పోయారనే ఆరోపణలు ఉన్నాయి. గడిచిన ఏడాది 2631 పనులు చేపడితే ఈ ఏడాది కేవలం 1389 పనులకు మాత్రమే అధికారులు ప్రతిపాదనలు పంపారు. గడిచిన ఐదేళ్లలో కేవలం 9వేల పనులు మాత్రమే ఈ పథకం ద్వారా జరిగాయి. రూ.20కోట్ల వరకు కూలీలకు వేతనాల కింద చెల్లించారు. రూ.13కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ కింద చెల్లించటం జరిగింది. పనుల నిర్వహణపై అశ్రద్ధ కారణంగా కూలీలు ఈ పథకంలో భాగస్వాములు అయ్యేందుకు ఆసక్తి చూపటంలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం యంత్రాంగం స్పందించి గ్రామాల పురోగతికి జాతీయ ఉపాధి హామీ పథకంను వినియోగించుకొని గ్రామాలభివృద్ధికి పాటుపడాలని గ్రామవాసులు కోరుకుంటున్నారు. లేదంటే ఈ ఏడాది కూడా పథక లక్ష్యం నీరు గారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం

పొన్నూరు టౌన్, మే 17: పొన్నూరు పట్టణ, మండలంలో గురువారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్థం చేసింది. భారీ వర్షం ఏకధాటిగా కురవటంతో మండలంలో 49.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. తెల్లవార్లు కురిసిన భారీ వర్షానికి రహదారుల్లో నీరునిలిచాయి. గత కొన్నిరోజులుగా వేసవి ఎండల తీవ్రత వల్ల ఇబ్బందిపడిన ప్రజలు భారీవర్షంతో వాతావరణం చల్లబడిపోవటంతో ఉపశమనం పొందారు. ప్రస్తుతం మండలంలో సాగవుతున్న తమలపాకులు, కూరగాయలు వంటి వాణిజ్య పంటలకు భారీ వర్షం మేలు చేస్తుందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సర్వీస్ ఓట్లను 4వ తేదీ వరకు స్వీకరిస్తాం

పొన్నూరు టౌన్, మే 17: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సర్వీస్ ఓటర్ల నుంచి ఓట్లను జూన్ 4వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు రిటర్నింగ్ ఆఫీసర్ ఎ లక్ష్మీకుమారి శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలో 513 మంది సర్వీస్ ఓటర్లు ఉండగా ఈ నెల 16వ తేదీ వరకు 64 మాత్రమే పోస్టల్ ద్వారా అందినట్లు చెప్పారు. మిగిలిన సర్వీస్ ఓట్లు జూన్ 4వ తేదీ వరకు స్వీకరించనునట్లు తెలిపారు. అలాగే ఎన్నికల విధులో ఉన్న 2,521 మంది ఉద్యోగులు 2,428 పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునట్లు చెప్పారు. అత్యవసర సేవల కింద ఉన్న 157 మందిలో 85మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునట్లు చెప్పారు. హోం ఓటింగ్ విధానంలో 284మంది ఉండగా 277మంది ఓటు హక్కును వినియోగించుకునట్లు రిటర్నింగ్ ఆఫీసర్ తెలిపారు.

## నేడు విద్యుత్ కోత

పొన్నూరు టౌన్, మే 17: పొన్నూరు పట్టణ, మండలంలో నేడు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ ఎం.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ మెయిన్‌టెనెన్స్ పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

## హంసవాహనంపై ఊరేగిన భావనారాయణ స్వామి

పొన్నూరు టౌన్, మే 17: శ్రీ సుందరవలీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణస్వామి వార్షికోత్సవ బ్రహోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారు సరస్వతి అలంకరణలో పూజలందుకున్నారు. ఉదయం ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో కొలువుతీరిన ఉత్సవ మూర్తులకు సరస్వతిదేవి అలంకారం చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ అర్చక స్వాములు అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తులను ప్రతిష్టించి నగరోత్సవం జరిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సరస్వతి దేవి అలంకరణలో
పూజలందుకున్న భావనారాయణ స్వామి

## 19న అన్నమయ్య పాటల పోటీలు

తెనాలి అర్బన్, మే 17: శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఈ నెల 19 ఆదివారం అన్నమయ్య పాటల పోటీలు నిర్వహిస్తారు. బోసు రోడ్డులోని శ్రీవాసవీ ఆలయ ఆవరణలోని గీతా మందిరంలో నిర్వహించే పోటీలలో ఆరేళ్ల నుంచి 65 ఏళ్ల వరకు ఎవరైనా పాల్గొనవచ్చని కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు. 32మందికి నగదు బహుమతులు ఇస్తామని ఆసక్తి కలిగిన గాయకులు పాల్గొనాలని చెప్పారు.

## అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన శివకుమార్ దంపతులు

తెనాలి రూరల్, మే 17: పట్టణంలోని బోస్‌రోడ్డులోగల శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కొలువుదీరిఉన్న అమ్మవారికి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్, పుష్పదంపతులు పట్టువస్త్రాలు, పుష్పాలు సమర్పించారు. శ్రీ వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడులకలను పురస్కరించుకు ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజాకార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం అన్నాబత్తుని శివకుమార్, పుష్ప దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు వారిని సాదరంగా ఆహ్వానించి అమ్మవారి దర్శనం అనంతరం వేద ఆశీస్సులు అందించారు. పలువురు ఆలయ కమిటీసభ్యులు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.